ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



శనివారం | 30-05- 2026 | సంపుటి: 17, సంచిక: 57, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆




## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా

# ఇళ్ల డిజైన్

### భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, మే 29 (ప్రజాకలం) : పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## పార్టీ కార్యక్రమాల్లో మంత్రులు

# పాల్గొనాల్సిందే..

### పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

### పది రోజులకు ఒకసారి కార్యకర్తలను కలుస్తా

### నెలలో 3 రోజులు కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తా

### జమీందార్లుగా మారిన కొంత మంది ఎమ్మెల్యేలు: సీఎం రేవంత్

హైదరాబాద్, మే 29 (ప్రజాకలం) : పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ కార్యక్రమాల్లో తనతో సహా ఎవరికీ మినహాయింపు లేదన్నారు. పది రోజులకు ఒకసారి కార్యకర్తలను కలుస్తానని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నెలలో 3 రోజులు కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తానని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొనాల్సిందేనని కుండబద్దలు కొట్టారు. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లుగా తయారయ్యారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్లుగా పార్టీ కోసం పనిచేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వ్యక్తిగత ప్రచారం తప్ప.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రచారం చేయడం లేదని మండిపడ్డారు. సోషల్ మీడియాపై ఎమ్మెల్యేలకు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. ఎస్ఐఆర్‌పై అందరూ అవగహన పెంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎస్ఐఆర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామం అని పేర్కొన్నారు. ఎస్ఐఆర్.. లంబాడీలు ,ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. కొన్ని నియోజకవర్గాల్లో చాలా మంది వలస పోయారని తెలిపారు. మహిళలకు కూడా ఎస్ఐఆర్ వల్ల సమస్యలు ఎదురు కావచ్చునన్నారు. ఎస్ఐఆర్ వల్ల దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశం ఉందని ఆందోళన చెందారు.



తరువాయి 2వ పేజీలో...

## ధాన్యం కొనుగోళ్లలో

# తెలంగాణ నెం.1

### - ధాన్యం, మక్కల కొనుగోళ్లలో సిన్సియర్ గా పనిచేస్తున్నాం

### - చివరిగింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం

### - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, మే 29 (ప్రజాకలం) : ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ నెం.1 అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ధాన్యం, మక్కల కొనుగోళ్ల విషయంలో సిన్సియర్ గా పనిచేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ తెలిపారు. కొనుగోళ్ల అంశంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 29 రాష్ట్రాల్లో తెలంగాణలో కొనుగోలు చేస్తున్నట్లు ఎక్కడా చేయడం లేదని వివరించారు. భారత ప్రభుత్వమే దీనిని అంగీకరించిందని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ నెంబర్ వన్ అని కేంద్రం చెబుతోందని తెలిపారు. పంట మద్దతు ధర కోసం రూ. 16 వేల కోట్లకుపైగా ఖర్చు చేశామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాకా రాష్ట్రంలో ఇప్పటివరకు ఐదు పంటలు పండాయని చెప్పారు. ఐదు పంటల్లో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిపామని స్పష్టం చేశారు. చివరిగింజ వరకు మద్దతు ధరతో కొనుగొలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. యాసంగిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామని, కేంద్రం 52మెట్రిక్ టన్నులే కొనుగోలు చేస్తామని చెప్పిందన్నారు. కేంద్రం కొనకున్నా.. తాము 75 లక్షల మెట్రిక్ టన్నులు కొంటున్నామని చెప్పారు. ఇప్పటివరకు 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని తెలిపారు. 8 వేల 575 కొనుగోలు కేంద్రాల్లో పంటలు కొంటున్నామని వివరించారు. 13 వేల వాహనాలు, 2 లక్షల మందికి పైగా ధాన్యం కొనుగోళ్లలో పాల్గొంటున్నారని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఇప్పటివరకు 11 వేల 50 కోట్లను రైతులకు చెల్లించామని లెక్కచెప్పారు. తడిసిన ధాన్యం కూడా మద్దతు ధరతో కొంటున్నామని వెల్లడించారు. 60 లక్షల ఎంటీల్లో 9 వేలకు పైగా టన్నుల తడిసిన ధాన్యం ఉందన్నారు. ఇసుక, సిమెంట్ ఫ్యాక్టరీల లారీలు ధాన్యం కోసం ఉపయోగిస్తున్నామని చెప్పారు.

## జూన్ 1న డీకే

# ప్రమాణస్వీకారం

### సిద్ధరామయ్య తనయుడికి డిప్యూటీ సీఎం!



న్యూఢిల్లీ: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాతో డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టనుండటం ఖాయమైంది. నాయకత్వ మార్పు నేపథ్యంలో తన కుమారుడు, ఎమ్మెల్యే యతీంద్ర సిద్ధరామయ్యకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని సిద్ధరామయ్య కోరినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

తరువాయి 2వ పేజీలో...



## రాజౌరీ అడవుల్లో

# యాంటీ టెర్రర్ ఆపరేషన్

రాజౌరి : జమ్ముకశ్మీర్ లోని రాజౌరి జిల్లాలోని మంజకోట్ సెక్టార్ అటవీ ప్రాంతాల్లో సైన్యం, జమ్మూ కాశ్మీర్ పోలీసులు, CRPF సంయుక్తంగా చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ శుక్రవారం నాటికి ఏడవ రోజులోకి ప్రవేశించిందని అధికారులు తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

## వందేమాతరంపై

# మళ్లీ రగడ

### కేరళ గవర్నర్ అసంతృప్తి

తిరువనంతపురం: కేరళ రాజకీయాల్లో మరోసారి 'వందేమాతరం'పై వివాదం చోటుచేసుకుంది. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) పాలసీ అడ్రస్ సందర్భంగా అసెంబ్లీలో 'వందేమాతరం' గేయాన్ని పూర్తిస్థాయిలో పాడకపోవడంపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ అసంతృప్తి వ్యక్తం చేసారు.

2లో



## ఎస్ఐఆర్ పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి

6

## కలం కౌంటర్




## గురుకులాల్లో సీట్ల భర్తీకి

# భారీ స్పందన

### పేద, అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం

### - సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



హైదరాబాద్, మే 29 : తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నాన్-సీఓఈ మరియు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం డా.బి . అర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు విడుదల చేశారు.

తరువాయి 2వ పేజీలో...



## రాష్ట్రంలో 95 శాతం ధాన్యం

# కొనుగోలు చేశాం

### చివరి గింజ వరకు రైతుల ధాన్యం కొనుగోలు చేస్తాం

### బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలి

### మంథని వ్యవసాయ మార్కెట్ యార్డు పరిశీలనలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు

మంథని,మే29: రాష్ట్రంలో రైతుల వద్ద నుంచి 95 శాతం ధాన్యం కొనుగోలు చేశామని, చివరి గింజ వరకు రైతుల ధాన్యం కొనుగోలు చేస్తామని మంథని వ్యవసాయ మార్కెట్ యార్డు పరిశీలనలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు

# మొగ్గుచూపాలి

### సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలం

### ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

### రైతులు పంట వ్యర్థాలను కాల్చొద్దు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మే 29 (ప్రజాకలం) : హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో హెచ్‌ఎంటీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్గానిక్ మేళా ప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు.



తరువాయి 2వ పేజీలో...

## పార్టీ కార్యక్రమాల్లో మంత్రులు

# పాల్గొనాల్సిందే..

మొదటి పేజీ తరువాయి...

ఎస్ఐఆర్ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపైన సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని పార్టీ కేడర్‌కు ఈ సందర్భంగా సీఎం సూచించారు. బూత్ ఎన్‌రోలర్ల సహాయంతో గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్‌షిప్ చేయించామని వివరించారు. ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో సన్మానం చేయించామన్నారు. గతంలో కాంగ్రెస్ సభ్యత్వంలో కీలక పాత్ర పోషించిన ఎన్ రోలర్స్‌ను ఎస్ఐఆర్ విషయంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు.
డిజిటల్ మెంబర్‌షిప్ కోసం ప్రతి నియోజక వర్గంలో ఒక ఇన్చార్జిను నియమించి నిరంతరం పర్యవేక్షించామని చెప్పారు. ఎస్ఐఆర్ కోసం 119 నియోజకవర్గాలు, 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్చార్జిలను నియమించాల్సి ఉందని వివరించారు. అసెంబ్లీ ఇంచార్జిలు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందేనని చెప్పారు. ఇంచార్జిలు కరెక్ట్‌గా పనిచేస్తే ఒక్క ఓటు కూడా డిలీట్ కాకుండా చూడొచ్చునని నేతలకు సీఎం రేవంత్ వివరించారు.
ఇన్చార్జి మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను ఇన్చార్జి మంత్రులు కలవాల్సి ఉందని వివరించారు. తాను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తానని చెప్పారు. నెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం ఇస్తానని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేయాల్సిందే నేతలకు స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు.. ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందేనని.. చివరకు తనతోపాటు ఎవరికి మినహాయింపు లేదని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.
మాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలని నేతలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దాదాపుగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామని వివరించారు. పార్టీ తరుపున ఇప్పుడు వేలాది మంది సర్పంచ్‌లు ఉన్నారని.. అలాగే మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు కూడా ఉన్నారని పేర్కొన్నారు. వలస పోయిన వారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడాల్సి ఉందన్నారు. పార్టీ నాయకులంతా సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే.. కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని వివరించారు.
రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యతలు అప్పగించాలని పార్టీలోని ముఖ్య నేతలకు సూచించారు. హైదరాబాద్ నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ పైన అసెంబ్లీల వారీగా సమావేశాలు పెట్టాల్సిన అవశ్యకతను ఈ సందర్భంగా సీఎం రేవంత్ వివరించారు. ఎస్ఐఆర్‌పైన మహిళా కాంగ్రెస్ తరపున క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించాలని పార్టీలోని నేతలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

మొదటి పేజీ తరువాయి...

పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.
క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు.
రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు... భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.
హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు.
ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.
గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

## జూన్ 1న డీకే ప్రమాణస్వీకారం

మొదటి పేజీ తరువాయి...

కీలకమైన సీఎల్‌పీ నేత ఎన్నిక శనివారంనాడు జరుగనుంది. సీఎల్‌పీ నేతగా డీకే ఎన్నికైన అనంతరం ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. జూన్ 1న డీకే సర్కార్ ప్రమాణస్వీకారం చేయనుంది. అంతవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య కొనసాగుతారు. కాగా, మంత్రివర్గ కూర్పుపై ఢిల్లీలో సిద్ధరామయ్య, డీకే పార్టీ అధిష్ఠానంతో వరుస సమావేశాలు జరుపుతున్నారు. ఈ సమావేశంలో సిద్ధరామయ్య తన డిమాండ్లను అధిష్ఠానం ముందుంచినట్టు చెబుతున్నారు. యతీంద్ర సిద్ధరామయ్యకు ఉపముఖ్యమంత్రి పదవిని సిద్ధరామయ్య ఆశిస్తున్నారు. దీనితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు కేజే జార్జి, జి.పరమేశ్వరలకు క్యాబినెట్‌లో చేటు కల్పించాలని సిద్ధరామయ్య కోరినట్టు తెలుస్తోంది. ఆ ఇద్దరూ కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్ష పదవిని ఆశించడం లేదని ఆయన వివరించినట్టు తెలిసింది.

**నేడు సీఎల్‌పీ సమావేశం**

కాగా, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం శనివారంనాడు జరుగునున్నట్టు మీడియాతో మాట్లాడుతూ శివకుమార్ తెలిపారు. కేంద్ర నాయకులు వస్తున్నారని, పార్టీ ఎమ్మెల్యేలంతా బెంగళూరులోనే ఉండాల్సిందని కోరామని ఆయన చెప్పారు.

**ఖర్గేను కలిసిన సిద్ధరామయ్య**

మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఆయన నివాసంలో సిద్ధరామయ్య కలిసారు. కర్ణాటక మంత్రులు ప్రియాంక్ ఖర్గే, కేసీ జార్జ్, యతీంద్ర సిద్ధరామయ్య ఆయన వెంట ఖర్గేను కలిసిన వారిలో ఉన్నారు. దీనికి మందు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, విపక్ష నేత రాహుల్ గాంధీని 10 జన్‌పథ్‌లో సిద్ధరామయ్య కలిసారు. మర్యాదపూర్వకంగానే కేంద్ర నేతలను సిద్ధరామయ్య కలిసినట్టు కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకు సిద్ధరామయ్య తన పదవికి గురువారం నాడు రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఆమోదించేందుకు, మంత్రిమండలిని రద్దు చేసేందుకు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ లాంఛనంగా అంగీకరించారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగేంత వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాల్సిందిగా సిద్ధరామయ్యకు గవర్నర్ సూచించారు.

## రాష్ట్రంలో 95 శాతం ధాన్యం
## కొనుగోలు చేశాం

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని, రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని 95శాతం ప్రభుత్వం కొనుగోలు చేసిందని మంత్రి తెలిపారు. అయినప్పటికీ అక్కడ అక్కడ మిగిలి ఉన్న దాన్ని చూపుతూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి పొందాలని తాతకలాడుతున్నారన్నారు. రైతులను తప్పుదారి పట్టించేందుకు బిజెపి నాయకులు రాష్ట్రంలో పర్యటిస్తూ ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని, అక్కడ అక్కడ మిగిలి ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు. మంత్రి వెంట మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ముత్తారం మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్మోహన్ రావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు
# మొగ్గుచూపాలి

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఆర్గానిక్ సాగు వైపు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారవంతత దెబ్బతింటోందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులు వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజలు ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు.

## రాజౌరీ అడవుల్లో యాంటీ టెర్రర్ ఆపరేషన్

మొదటి పేజీ తరువాయి...

ఆ ప్రాంతంలో అనుమానిత ఉగ్రవాదుల ఉనికికి సంబంధించిన నిఘా సమాచారం మేరకు డోరిమల్-గంభీర్ మొగ్లా అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఉగ్రవాదులు పారిపోకుండా నిరోధించేందుకు, దట్టమైన అటవీ ప్రాంతం చుట్టూ గట్టి నిఘా వలయం ఏర్పాటు చేసి భద్రతా దళాలు ఆపరేషన్‌ను ముమ్మరం చేశాయని అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల రహస్య స్థావరాలపై మల్టిపుల్ గ్రెనేడ్ లాంచర్లతోబలగాలు దాడి చేస్తున్నాయి. అడవి లోపలి భాగం నుంచి భారీగా కాల్పులు, పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. ఈ ఆపరేషన్ కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో గురువారం నాడు డోరిమల్ ప్రాంతంలో భారీగా కాల్పులు, షెల్లింగ్ జరిగినట్లు సమాచారం అందిందని తెలిపారు. ఈ ఆపరేషన్‌ను మరింత పటిష్టం చేసేందుకు అదనపు బలగాలను, లాజిస్టికల్ మద్దతును ఆ ప్రాంతానికి హుటాహుటిన తరలించారు.
అదే సమయంలో, అటవీ ప్రాంతపు లోపలి భాగాల్లో నిఘా, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. దుర్గమ ప్రాంతాల్లో భద్రతా దళాలు విస్తృత గాలింపు చర్యలు చేపడుతున్నాయని, అనుమానిత రహస్య స్థావరాల చుట్టూ కట్టుదిట్టమైన పహారాను కొనసాగిస్తున్నాయని అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికల గురించి అందిన నిర్దిష్ట నిఘా సమాచారం మేరకు, ఈ వారం ప్రారంభంలో సైన్యం, సీఆర్పీఎఫ్, జమ్మూ కాశ్మీర్ పోలీసులు సంయుక్తంగా "ఆపరేషన్ షేరువాలి" అనే సంకేతనామంతో ఈ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ఉగ్రవాదుల గాలింపు కోసం అత్యాధునిక డ్రోన్లు, హెలికాప్టర్లు, స్నిఫర్ డాగ్ లను రంగంలోకి దింపారు. సున్నితమైన ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేయాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు.

# వందేమాతరంపై మళ్లీ రగడ

మొదటి పేజీ తరువాయి...

అసెంబ్లీ నుంచి బయటకు వస్తూ మీడియాతో ఆయన మాట్లాడారు. అధికారిక కార్యక్రమాల్లో గవర్నర్ ఎప్పుడు హాజరైనా సరైన ప్రోటోకాల్ పాటించాల్సి ఉంటుందని అన్నారు. కేరళ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ముందు, తరువాత ఒక బ్యాండ్ టీమ్ 'వందేమాతరం' గేయంలోని మొదటి చరణాలను మాత్రమే ప్లే చేసింది. దీనిపై గవర్నర్ మాట్లాడుతూ, గవర్నర్ ఎప్పుడు హాజరైనా వందేమాతర గేయాన్ని పూర్తిగానే పాడాల్సి ఉంటుందని అన్నారు. 'గేయాన్ని ఆలపించలేదు, ప్లే మాత్రమే చేశారు' అని చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ తిరువాంచూర్ రాధాకృష్ణన్‌తో తాను ఇప్పటికే మాట్లాడానని, ఏం జరుగుతోందో చూద్దామని అన్నారు.

**గవర్నర్‌ను అమానించడమే..**

కాగా, ప్రభుత్వ విధానాలపై గవర్నర్ శుక్రవారంనాడు ప్రసంగించిన సమయంలో వందేమాతరం గేయాన్ని పూర్తిస్థాయిలో ఆలపించకపోవడాన్ని బీజేపీ తప్పుపట్టింది. ఇది లోక్‌భవన్, గవర్నర్‌ను అవమానపరచడమేనని పేర్కొంది. గవర్నర్ ఎప్పుడు హాజరైనా జాతీయగేయం వందేమాతరాన్ని పూర్తి స్థాయిలో వినిపించాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నాయని బీజేపీ సీనియర్ నేత, కాలకూట్టం ఎమ్మెల్యే వి.మురళీధరన్ తెలిపారు. అయితే కేరళ ప్రభుత్వం కేంద్రం ఆదేశాలను పాటించలేదన్నారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సమయంలో ఇలా చేయడం జాతీయగేయానికే అవమానమని విమర్శించారు. వీడీ సతీశ్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రభుత్వం జమాతే ఇస్లామీ, సీపీఎం అభిప్రాయాలకు తలొగ్గుతోందని ఆరోపించారు. జాతీయగేయం సెక్యులర్ లైన్స్‌లో లేదంటూ ఆ పార్టీలు చేస్తున్న వాదనతో ప్రభుత్వం ఏకీభవించినట్టు స్పష్టమవుతోందని అన్నారు.

# గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారు విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు.

**మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఇబ్బందులను సత్వరమే పరిష్కరించండి**

మహాత్మా జ్యోతిబా ఫూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగజీవన్ రామ్ వంటి మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఎదురవుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు అధికారులను ఆదేశించారు.
మహనీయుల విగ్రహాలు కేవలం శిల్పాలు కావని, అవి సామాజిక చైతన్యానికి, స్వాభిమానానికి, రాజ్యాంగ విలువలకు ప్రతీకలని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దళితులు, గిరిజనులు, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి అత్యంత కట్టుబడి పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. సమాజంలోని అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఎదురవుతున్న ఇబ్బందులపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దళిత సంఘాల ప్రతినిధులు, యువకులు, ప్రజా సంఘాల నాయకులు విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి ఎదురవుతున్న స్థల సమస్యలు, అనుమతుల జాప్యం, స్థానిక స్థాయిలో తలెత్తుతున్న అభ్యంతరాలు, పోలీసు అనుమతులు, రెవెన్యూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.
దీనిపై స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... మహనీయుల ఆశయాలను గ్రామస్థాయి నుంచి యువతలోకి తీసుకెళ్లే ప్రక్రియలో విగ్రహాల ప్రతిష్టాపనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలలో అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాహుల్ గాంధీ చేపట్టిన "భారత్ జోడో యాత్ర" దేశంలో సామాజిక ఐక్యత, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం లక్ష్యాలతో సాగిందని మంత్రి పేర్కొన్నారు. ఆ యాత్రలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా ఫూలే, బాబూ జగజీవన్ రామ్ వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లే స్ఫూర్తి ప్రతిబింబించిందన్నారు.
సమానత్వం, సోదరభావం, హక్కుల పరిరక్షణ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల మూలాధారమని చెప్పారు. విగ్రహాల ప్రతిష్టాపనలో ఎలాంటి అనవసర జాప్యం జరగకుండా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను చట్టబద్ధంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని సూచించారు. నియమ నిబంధనలకు అనుగుణంగా లేని స్థలాల విషయంలో ముందుగానే సంబంధిత సంఘాలకు స్పష్టమైన నోటీసులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. చివరి నిమిషంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, దళిత సంఘాలతో చర్చించి ముందస్తు పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనవసరంగా దళిత సంఘాల నాయకులపై కేసులు నమోదు చేయడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు.సమస్యల పరిష్కారంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల మనోభావాలను గౌరవించాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా వివాదాస్పద పరిస్థితులు నెలకొంటే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేస్తోందని, మహనీయుల ఆశయాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన రాజ్యాంగ మార్గం, మహాత్మా ఫూలే సూచించిన సామాజిక సమానత్వ భావన, బాబూ జగజీవన్ రామ్ అందించిన ప్రజాస్వామ్య స్ఫూర్తి రాష్ట్ర ప్రభుత్వానికి మార్గదర్శకాలని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (వెల్ఫేర్) సభ్యసాచి ఘోష్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనోజ్ చౌదరి, ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, హైదరాబాద్ డీసీపీ-II కాజల్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, ఏసీఎల్‌బీ జి. జితేందర్ రెడ్డి, ఎస్సీడీడీ వీసీ ఉ ఎండీ (ఎఫ్ఏసీ) హనుమంత్ నాయక్, ఎస్సీడీడీ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, రామారావు, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సంతోష్, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతో, ఎల్‌బీనగర్ సీపీ శ్రీనివాస్ యాదవ్, సైబరాబాద్ ఎస్‌బీ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర, ఓఎస్డీ వై .జే. విజయ్ కుమార్ తదితర అధికారులతో పాటు ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు దొమ్మాటి సుదర్శన్ బాబు, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాం ప్రసాద్, కళానిధి మాస్టర్ జీ, నల్ల సూర్యప్రకాశ్, సొసైటీ ఫర్ సోషల్ జస్టిస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జీటీ శేఖర్, ఆల్ ఇండియా ఎస్సీ/ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎస్. నాను, జి.బి. శ్యామ్ రావు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఉ బాబూ జగజీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వీకర్ సెక్షన్ అసోసియేషన్ (ఆదర్శనగర్) తాలూకా అనిల్, ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కుర్మల్‌గూడ నాయకులు సంగం మహేష్, కుర్మ మహేందర్, రాపాక అశోక్ తదితర దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీని చూసి నేర్చుకోండి..

## నీట్ పేపర్ లీక్‌పై 'సుప్రీం' వ్యాఖ్య



న్యూఢిల్లీ :నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు తాజాగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. సివిల్స్ పరీక్షలు నిర్వహించే యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యుపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. కోర్టు విచారణకు ఎన్‌టీఏ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు ఏర్పాటైన హైలెవెల్ కమిటీ ఛైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ ఎలా లీక్ అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య తలెత్తిందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలనూ సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు.
కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21న నిర్వహించనున్న పరీక్ష కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు.

## డాగ్ స్క్వాడ్ సహాయంతో గంజాయి మాదక ద్రవ్యాల కోసం విస్తృత తనిఖీలు

### - ధర్మపురి సిఐ ఎలపాటి రామ్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో



ధర్మపురి, మే 29 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచనలతో, ధర్మపురి సీఐ రామ్ నర్సింహారెడ్డి ఆధ్వర్యం లో ధర్మపురి ఎస్సై జి మహేష్, పోలీస్ సిబ్బంది, ట్రెయిన్డ్ డాగ్ స్క్వాడ్ సహాయం తో గంజాయి, ఇతర నిషేధిత మాదక ద్రవ్యాల కోసం విస్తృత తనిఖీలు చేపట్టారు. జగిత్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యం లో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాలు మత్తు పదార్థాల ను పట్టు కునేందుకు నిఘా టీం వారు ట్రెయిన్డ్ డాగ్ స్క్వాడ్ సహాయం తో ప్రతి మండలంలోని ప్రధాన ప్రాంతాల లో విస్తృత తనిఖీలు నిర్వ హిస్తున్న నేపథ్యం లో, ధర్మపురి పట్టణంలోని ప్రముఖ కాలేజీల పరిసల ప్రాంతం లో ఉన్న కిరాణా దుకాణాలు, టీ స్టాళ్లు, పాన్ షాపులు, బస్టాండు అనుమానా స్పద ప్రాంతాల లో ప్రత్యేక చెకింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యువతకు ధర్మపురి సీఐ ఎ రామ్ నర్సింహారెడ్డి ప్రత్యేక అవగాహన కల్పించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. అలాంటి నిషేధిత పదార్థాలకు దూరంగా ఉండాలని ఎవరైనా గంజాయి విక్రయాలు లేదా వినియోగం నిర్వహిస్తు న్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ధర్మపురి సీఐ సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగంలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని పోలీసులు హెచ్చరించారు.

### రైతుల పొలాల్లో మంటలను ఫైర్ ఇంజన్ సహాయంతో

## మంటలను ఆర్పిన సిబ్బంది

ఎండపల్లి, మే 29 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో రైతుల పొలాల్లో నిన్న జరిగిన సంఘటన చెలరేగిన



మంటలు చల్లార్చినప్పటికీ శుక్రవారం రోజున ఆ మంటలు నాలుగు దిశల వ్యాపించడంతో గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్ సహాయం తో చల్లార్చినప్పటికీ చల్లారకపోవడంతో ధర్మపురి ఫైర్ ఇంజన్ కు ఫోన్ చేయగానే ధర్మపురి ఫైర్ స్టేషన్ ఎస్సై సిహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యం లో లీడింగ్ ఫైర్ మెన్ కే లక్ష్మీనారాయణ, డిఓపి రత్నాకర్, ఫైర్ మెన్ లు ప్రశాంత్, శ్రీనివాస్ లు కలిసి మంటలను నాలుగు దిశల వ్యాపించిన మంటలను చల్లార్చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొల్లపల్లి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ట్రాన్స్ఫార్మర్ నుండి విద్యుత్ వైర్లు రోడ్డు దాటే వరకు నాలుగు పోల్లు వేసి విద్యుత్తు లైను గుంజినట్లయితే బాగుంటుందని ఏఈ బండి సమ్మయ్య కు ఫోన్ చేసి మాట్లాడారు దానికి ఏఈ బండి సమ్మయ్య ఒకే చెప్పినట్లు గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ తెలిపారు. ఈ మంటలను ఆర్పేందుకు సహకరించిన అరిగెల రవి, గ్రామ ప్రజలు, మహిళలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకు లింకేజీ ఫామ్ నాన్ ఫామ్ మార్కెటింగ్ విభాగాలకు జంబో చెక్కుల పంపిణీ




వెల్గటూర్, మే 29 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండల కేంద్రం లో 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా శుక్రవారం రోజున వెన్నెల మండల సమైక్య అధ్యక్షురాలు అధ్యక్షతన, ఏపీఎం తులసి మాత అద్వర్యం లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి కార్యక్రమాల తో పాటుగా అన్ని సెర్ప్ కార్యక్రమాలు ప్రగతిని బ్యాంకు లింకేజీ, ఫామ్ /నాన్ ఫామ్, మార్కెటింగ్ విభాగాల కు జంబో చెక్కులు పంపిణి చేయడం జరిగింది, ఇట్టి సమావేశానికి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోల్ల తిరుపతి, కోటిలింగాల ఆలయ కమిటీ చెర్మన్ పూదరి రమేష్, వెల్గటూర్ ఎంపీడీఓ, ఆర్ఐ దొంత రాజేశ్వరి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంకు ల బ్యాంకు మేనేజర్ లు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మెస్, ఓబీ లు, సీసీలు మురళి, జక్క శ్రీనివాస్, వివోఏ లు, ఎంఎస్ఏ, సీవో, మహిళా సంఘాల సభ్యులు హాజరైనట్లు ఏపిఎం తులసి మాత తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం కేసు నమోదు



రుద్రంగి, 29, (ప్రజాకలం ప్రతినిధి)

ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైన సంఘటన రుద్రంగి మండలకేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ మోతీరాం తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల క్రితం రుద్రంగి గ్రామానికి చెందిన గడ్డం గణేష్ (40) అనే వ్యక్తి అదృశ్యం అయ్యాడని, అతని భార్య లావణ్య పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారని, అతను మేస్త్రి పని చేసుకుని పోషించేదని రెండు రోజుల క్రితం ఉదయం 11 గంటలకు ఇంటి నుండి ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదని చుట్టుపక్కల ప్రాంతాల్లో బంధువుల ఇండ్లలో వెతికిన అతని జాడ దొరకలేదని ఫిర్యాదు చేయగా దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వెల్గటూర్ మండల కేంద్రంలో పలు షాపుల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

### - మాదక ద్రవ్యాలను సమాజం నుండి పూర్తిగా నిర్మూలించాలన్న ధర్మపురి సీఐ రామ్ నరసింహారెడ్డి

వెల్గటూర్, మే 29 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ బెల్గాటూరు మండల కేంద్రం లో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లావ్యాప్తంగా మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమం లో జిల్లా మాదకద్రవ్యాల మత్తు పదార్థాల నిఘా టీం ఆధ్వర్యం లో డాగ్ స్క్వాడ్ సహాయం తో ప్రతి మండలంలోని ప్రధాన ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వ హించబడుతున్నాయి. ఈ నేపథ్యం లో జగిత్యాల డిఎస్పి పురుషోత్తం రెడ్డి సూచనల మేరకు, ధర్మపురి సీఐ ఎలపాటి రామ్ నరసింహారెడ్డి ఆధ్వర్యం లో వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్, వెల్గటూర్ పోలీస్ సిబ్బంది, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి వెల్గటూర్ మండల కేంద్రంలోని పలు దుకాణాలు, ప్రజా రద్దీ



ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా పరిసర ప్రాంతాల్లోని కిరాణా షాపులు, టీ స్టాళ్లు, పాన్ దుకాణాలు, బస్టాండ్ పరిసరాలు, అనుమానాస్పద ప్రదేశాల లో గంజాయి, ఇతర నిషేధిత మాదక ద్రవ్యాల కోసం విస్తృతంగా తనిఖీలు నిర్వ హించటం జరిగింది. ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై వివరించటం జరిగింది. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ ఎలపాటి రామ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తాయని, ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ, సామాజిక జీవితాల పై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. యువత చెడు వ్యస నాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఐ సూచించారు. అలాగే ఎవరైనా గంజాయి విక్రయాలు, రవాణా, నిల్వ లేదా వినియో గానికి పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ నేతృత్వం లో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇటువంటి తనిఖీలు నిరంతరం నిర్వహించ బడతాయని వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదం కేసులో 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధింపు




బుగ్గారం, మే 29 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ బుగ్గారం పోలీస్ స్టేషన్ రోడ్డు ప్రమాదం జరిగిన కేసులో తేదీ 29.05.2026 శుక్రవారం రోజున గౌరవ నీయులైన యేగి జానకి, జూనియర్ సివిల్ జడ్జి ఢ జె.ఎం.ఎఫ్.సి కోర్టు, ధర్మపురి, జగిత్యాల జిల్లా వారు, పి.ఎస్ బుగ్గారం క్రైమ్ నెం. 41/ 2017, సెక్షన్ 304-ఏ ఐపిసి కి సంబంధించిన సి.సి నెం. 685/2022 కేసులో తీర్పు వెలువరించి నిందితుడికి శిక్ష విధించారు. ఈ కేసు యొక్క వివరాలు తేదీ 29.08.2017 రోజున సాయంత్రం సుమారు 4:30 గంటల సమయం లో రామకృష్ణ కాలనీ, తిమ్మాపూర్ మండలం, కరీంనగర్ జిల్లాకు చెందిన ఆవుల సంపత్ తండ్రి రామయ్య వయస్సు 39 సంవత్సరాలు బుగ్గారం మండలం లోని బీర్సాని గ్రామ ప్రాథమిక పాఠశాల లో ప్రధానోపాధ్యాయు లుగా విధులు నిర్వహిస్తూ తన మోటార్ సైకిల్ నెం. ఏపీ 15-ఏఏ 1581 పై వెల్గటూర్ లో కిరాయికి ఉన్న ఇంటికి వెళ్తుండగా, బ్రిలియంట్ మోడల్ స్కూల్ బస్సు నెం. ఏపీ 15-వై-1380 స్కూల్ బస్సు ను నడుపుతున్న డ్రైవర్ బస్సు ను అతి వేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఆయన బైక్‌ను ఢీకొనడం తో తలకు తీవ్ర గాయాలైనవి. గాయపడిన వ్యక్తిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అనంతరం కరీంనగర్ హసుపత్రి ద్వారా హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ తేదీ 06.09.2017 న ఉదయం 6:19 గంటలకు ఆవుల సంపత్ మృతి చెందినారు. ఈ ఘటనపై ఫిర్యాదుదారు ఆవుల హనుమంతు తండ్రి రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పి.ఎస్ బుగ్గారం లో క్రైమ్ నెం.41/ 2017 గా మొదట సెక్షన్ 337 ఐపీసి కేసు నమోదు చేసి, అనంతరం బాధితుడు మృతి చెందడంతో సెక్షన్ 304-ఏ ఐపిసి గా మార్పు చేసి దర్యాప్తు నిర్వహించారు. దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా విచారణ అనంతరం గౌరవ న్యాయస్థానం నిందితుడు షాకాపురం లచ్చయ్య తండ్రి పోచయ్య వయస్సు 36 సంవత్సరాలు కులం గంగపుత్ర, గ్రామం ముత్తూర్ వెల్గటూర్ మండలం, (బ్రిలియంట్ మోడల్ స్కూల్ బస్సు డ్రైవర్) అను అతడికి 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 1000 రూపాయల జరిమానా విధించింది. ఈ కేసును అప్పటి ఎస్ఐ ఎన్. మధుకర్ (ప్రస్తుతం కెరిమెరి స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్నారు) దర్యాప్తు చేయగా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి రాజేష్ వాదనలు వినిపించారు. కేసు లైజన్, కోర్టు ఫాలోఅప్‌ను పిసి -567 ఎం కిరణ్ కుమార్, సి ఎం ఎస్, డబ్ల్యూపిసి-739 డి సుస్మిత, సిడిఓ, పోలీస్ స్టేషన్ బుగ్గారం సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కేసులో శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కట్టింగ్ పెట్టొద్దు - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

గోదావరిఖని,మే29:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు,రైస్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి,ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల శారద నగర్,గౌతమి నగర్‌లోని శ్రీరామ రైస్ మిల్,రాజరాజేశ్వర రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలోని రక్త పరీక్ష కేంద్రంలో సమయం ముగిసిందని ఏ రోగిని వెనక్కి పంపకుండా శాంపిల్స్ సేకరించాలని అధికారుల ను ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాల ప్రతిపాదనలు వెంటనే అందించాలని సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గైనిక్ ఓపీని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం శారద నగర్ లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ ఇంటర్మీడియట్ ఫలితాలు,స్టడీ రూమ్ సౌకర్యం,అడ్మిషన్లు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు అవసరమైన పరికరాల ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. అనంతరం గౌతమి నగర్‌లోని శ్రీరామ రైస్ మిల్,రాజరాజేశ్వర రైస్ మిల్లులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రైతుల ధాన్యంపై ఎలాంటి కట్టింగ్ పెట్టడానికి వీలు లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లారీలను



ఎప్పటికప్పుడు దించుకోవాలని,ఎక్కువ సమయం వేచి ఉండే పరిస్థితి కల్పించవద్దని మిల్లర్లను ఆదేశించారు. ఈ పర్యటనలో డాక్టర్ లు అరుణ,కృపాభాయి,రాజు,సంబంధిత అధికారులు,తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన శ్రీ సాయి రెస్టారెంట్ సీజ్

### - విస్తుపోయే నిజాలు వెలుగులోకి తెచ్చిన ఫుడ్ సేఫ్టీ తనిఖీలు



పెద్దపల్లి,మే 29:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతూ,కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉక్కుపాదం మోపారు. పెద్దపల్లి జిల్లా మంథని మార్కెట్ పరిసరాల్లోని ప్రముఖ శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్ ను పెద్దపల్లి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి.అంకిత్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, తాత్కాలికంగా సీజ్ చేశారు. వినియోగదారుల నుంచి వచ్చిన పదే పదే వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో రంగంలోకి దిగిన ఫుడ్ సేఫ్టీ బృందం అక్కడ నెలకొన్న అపరిశుభ్ర వాతావరణాన్ని చూసి షాక్‌కు గురైంది. వాస్తవానికి,గత ఏప్రిల్ నెలలోనే ఈ రెస్టారెంట్‌ను అధికారులు తనిఖీ చేసి,లోపాలను సరిదిద్దుకోవాలని గడువు విధించినప్పటికీ యాజమాన్యం ఆ ఆదేశాలను పూర్తిగా బేఖాతరు చేసింది. శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో వంటగది నిర్వహణ నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. కనీస గాలి ప్రసరణ లేని ఆ గదిలో,వంట చేసే ప్రదేశమంతా తీవ్ర అపరిశుభ్రంగా మారింది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన నూనె జిడ్డు,మురికితో వంటగది గోడలు,పైకప్పు,ఎగ్జాస్ట్ ప్రాంతాలు దారుణంగా దర్శనమిచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా పాత,పగిలిపోయిన ప్లాస్టిక్ డబ్బాల్లోనే కిరాణా సరుకులు,మసాలా దినుసులు నిల్వ ఉంచడం అధికారులను విస్మయానికి గురిచేసింది. మరోవైపు, వంటగదిలోని డ్రైనేజీ లైన్ పూర్తిగా ధ్వంసమై మురుగు నీరు నిలుస్తున్నా యాజమాన్యం పట్టించుకోలేదు ఆహార తయారీ కార్మికులు కనీస పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకుండా, హెడ్ క్యాప్స్, గ్లవ్స్ ధరించకుండానే వంటలు వండుతున్నారు. ఇక ఫ్రీజర్‌ను తెరిచి చూడగా భారీ పరిమాణంలో ముందే తయారు చేసి పెట్టిన మసాలాలు, అల్లం-వెల్లుల్లి పేస్టులను ఎలాంటి నిబంధనలు లేకుండా ఇష్టారాజ్యంగా నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. ఈ తీవ్రమైన ఉల్లంఘనలు ప్రజల ప్రాణాలకే ముప్పు తెచ్చేలా ఉండటంతో, హోటల్‌ను తక్షణమే మూసివేయిస్తున్నట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి.అంకిత్ రెడ్డి ప్రకటించారు. అధికారులు సూచించిన మార్పులన్నీ పూర్తి చేసి, సరైన ప్రమాణాలు పాటించినట్లు నిరూపించుకుంటేనే తిరిగి రెస్టారెంట్ తెరవడానికి అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ తనిఖీల సందర్భంగా మార్కెట్ ఏరియాలోని ఇతర కిరాణా దుకాణాల్లోనూ అధికారులు సోదాలు చేపట్టి,ల్యాబ్ పరీక్షల కోసం పలు ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## వాహన యజమాని డ్రైవర్ పై కేసు నమోదు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 29 (ప్రజా కలం) కొరుట్లలోని ఓ చిట్ ఫండ్ అఫీస్ ఎదురుగా ఉన్న ఎన్‌హెచ్-63 రహదారిపై కళేబరాలను పడేసిన గుర్తు తెలియని వ్యక్తులను గుర్తించి కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం అర్ధరాత్రి సమయంలో జంతువుల కళేబరాలు పడవేశారన్న సమాచారం మేరకు పోలిస్, మునిసిపల్ సిబ్బంది వెంటని అక్కడకు చేరుకొని, ముందుగా మున్సిపల్ సిబ్బందిచే వెంటనే వాటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బక్రీద్ పండుగ సందర్భంగా మత సామరస్యాన్ని భంగపరచే ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడినట్లు అనుమానించి, వెంటనే సానిటరీ ఇన్స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో బాగంగా స్పెషల్ టీం లను ఏర్పాటు చేసి సిసి ఫుటేజ్ లను పరిశీలించి వాహనంను, దాని వివరాలు తెలుసుకున్నట్లు వివరించారు. సంబంధించిన వాహనాన్ని రాత్రే అదుపులోకి తీసుకుని, వాహన యజమాని, దాని నడిపిన డ్రైవర్ ను అదుపులోకి తీసుకోని కోరుట్ల ఎస్ ఐ చిరంజీవి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రజా కలం

శనివారం, మే 30, 2026

# ఒకవైపు శాంతి మంత్రం.. మరోవైపు యుద్ధ తంత్రం..!

పశ్చిమాసియాలో త్వరలోనే శాంతి నెలకొంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచానికి శుభవార్త చెప్పారు. ఇరాన్ కూడా యురేనియం వదులుకునేందుకు సిద్ధమైంది. ఈ తరుణంలో ఇక అంతా మంచే జరుగుతుందని భావిస్తున్న వేళ అమెరికా ఆత్మరక్షణ పేరుతో ఇరాన్‌పై భీకర దాడులు మొదలు పెట్టింది. మరోమారు తన సైనిక బలాన్ని ప్రదర్శించింది. ఇరాన్ దక్షిణ తీర ప్రాంతాల్లోని బందర్ అబ్బాస్, క్వెష్మ్ పోర్టు సమీపంలోని సైనిక స్థావరాలు, క్షిపణి లాంచ్ ప్యాడ్లు, సముద్రంలో మైన్లు (మందుపాతరలు) పరచే బోట్లు, నేవీ బేస్‌లపై తీవ్ర దాడులు జరిపింది. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమోతీ హాకిన్స్ ఈ దాడులను "ఆత్మరక్షణ చర్య"గా సమర్థించారు. ఇరాన్ తీరం వెంట ఉన్న క్షిపణి స్థావరాలు తమ విమాన వాహక నౌకలు, యుద్ధ నౌకలకు నేరుగా ముప్పు కలిగించాయని, మందుపాతరలు పరచడానికి ప్రయత్నించే బోట్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. లర్క్ ద్వీపంలో కనీసం నలుగురు మరణించినట్లు సమాచారం. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ కూడా పాల్గొన్నట్లు కొన్ని వార్తా వర్గాలు పేర్కొన్నాయి. ప్రపంచ ఇంధన మార్గాల్లో ఆక్సిజన్‌గా భావించే హార్ముజ్ జలసంధి దాదాపు మూడు నెలలుగా స్తబ్దంగా మారింది. అమెరికా-ఇజ్రాయెల్ కూటమి, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఈ కీలకమైన నౌకా మార్గాన్ని అడ్డుకోవడంతో, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన హెచ్చరిక సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి 1967 సూయజ్ కాలువ సంక్షోభాన్ని గుర్తు చేస్తోంది. 1967 అరబ్?ఇజ్రాయెల్ యుద్ధంలో సూయజ్ కాలువలో 15 నౌకలు చిక్కుకుపోయి, ఎనిమిదేళ్లపాటు అక్కడే కూరుకుపోయాయి. 'ఎల్లో ఫ్లీట్'గా ప్రసిద్ధి చెందిన ఆ నౌకలు తుప్పు పట్టి, చరిత్రలో ఒక హెచ్చరికగా మిగిలిపోయాయి. ఇప్పుడు హార్ముజ్‌లోనూ అదే దృశ్యం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్ని రోజులు ఈ దిగ్బంధనం కొనసాగుతుందో, ఎన్ని ఓడలు ఈ జలసంధిలో నిలిచిపోతాయో ప్రస్తుతం ఎవరూ ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ఈ సంక్షోభం సైన్స్ ఫిక్షన్ లాగా అనిపించినా, వాస్తవం మాత్రం తీవ్రంగా ఉంది. సంక్షోభం ప్రారంభం నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్పష్టమైన దూరదృష్టితో ముందుకు వెళ్తోంది. హార్ముజ్‌పై ఆధారపడకుండా చమురు రవాణా చేసేందుకు ప్రత్యామ్నాయ పైప్‌లైన్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేసింది. 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కావొచ్చని అంచనాలు ఉన్నాయి. దౌత్య చర్చలు జరుగుతున్నా, దీర్ఘకాలిక ఉద్రిక్తతలు కొనసాగే అవకాశం ఉందని అబుదాబి అంచనా వేస్తోంది. ఇది ఒక దేశం మాత్రమే కాదు, మొత్తం గల్ఫ్ ప్రాంతం యొక్క భద్రతా వ్యూహంలో భాగం. సంక్షోభం త్వరలో ముగిసి, చమురు ధరలు అనియంత్రితంగా పెరగకుండా సమతుల్యత నిలుస్తుందని వారు నమ్ముతున్నారు. అయితే ఈ ఆశలు ఎంతవరకు వాస్తవ రూపం దాల్చేయనేది ప్రశ్నార్థకం. ప్రపంచవ్యాప్తంగా రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ చమురు సరఫరా అంతరాయం కలిగింది. సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలు, అత్యవసర నిల్వలు విడుదల చేయడం ద్వారా తాత్కాలికంగా పరిస్థితిని నియంత్రించగలిగాయి. కానీ ఈ నిల్వలు ఎప్పటికప్పుడు అయిపోతాయి. ఇరాన్ సంకల్పం. ఆర్థిక ఒత్తిడిఇరాన్ వైపు చూస్తే, తీవ్రమైన ఆర్థిక సవాళ్ల మధ్య కూడా వెనక్కి తగ్గే సంకేతాలు కనిపించడం లేదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ క్షీణత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, ఉనికి కోసం పోరాటం కొనసాగుతోంది. రెండు వైపులా 'ముందుగా ఎవరు ఒప్పుకుంటారు' అని వేచి చూడడం జరుగుతోంది. ఇలాంటి స్థిరత్వం లేని ఎదురు చూపు ప్రపంచానికి మరింత నష్టం కలిగిస్తుంది. హార్ముజ్‌ను శాశ్వతంగా మూసివేయడం ఎవరికీ లాభదాయకం కాదు. త్వరిత తాత్కాలిక ఒప్పందం అవసరం. అయితే గత చరిత్ర చెప్పినట్లు, ఒక్కసారి సాధారణమైన సంక్షోభాలు కాలక్రమేణా దీర్ఘకాలిక సమస్యలుగా మారే ప్రమాదం ఉంది. ప్రపంచ ఇంధన భద్రత ఇకపై భౌగోళిక రాజకీయాలపై ఆధారపడి ఉండదు. వైవిధ్యపరమైన సరఫరా మార్గాలు, పునరుత్పాదక ఇంధనాల వైపు వేగవంతమైన మార్పు, ప్రాంతీయ దేశాల మధ్య సహకారం- ఇవి భవిష్యత్ కోసం అనివార్యమైన అడుగులు. చరిత్ర నుంచి నేర్చుకోకపోతే, ఆర్థిక వ్యవస్థలు మాత్రమే కాదు, సమగ్ర ప్రపంచ స్థిరత్వం కూడా ప్రమాదంలో పడుతుంది. సమయం ఇంకా ఉంది, కానీ చాలా తక్కువగా ఉంది. ఏప్రిల్ 7న ప్రకటించిన సీజ్‌ఫైర్ అమలులో ఉన్నప్పటికీ ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని వేగంగా పునరుద్ధరిస్తోందని అమెరికా ఇంటెలిజెన్స్ గుర్తించింది. ఇది ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరిక. దోహాలో జరుగుతున్న కీలక దౌత్య ప్రయత్నాలుదాడులు జరుగుతున్న అదే సమయంలో ఖతార్ రాజధాని దోహాలో ఇరాన్-అమెరికా దూతల మధ్య కీలక చర్చలు సాగుతున్నాయి. ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ నేతృత్వంలోని బృందం ఈ సంప్రదింపుల్లో పాల్గొంటోంది. ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ అనేక అంశాలపై అవగాహన కుదిరినట్లు, అయితే ఇంకా కొన్ని కీలక సమస్యలు మిగిలి ఉన్నాయని తెలిపారు. ఇరాన్ ప్రధాన దృష్టి యుద్ధ ముగింపు (లెబనాన్‌తో సహా) వైపే ఉందని, ప్రస్తుతం అణు అంశాలను చర్చించడం లేదని స్పష్టం చేశారు. యుద్ధం పూర్తిగా ముగిస్తే 60 రోజుల వ్యవధిలో అణు సంబంధిత చర్చలు ప్రారంభించవచ్చని సంకేతాలిచ్చారు. ఖతార్ మధ్యవర్తిత్వం ఈ చర్చలకు కీలకమవుతోంది. లెబనాన్‌పైనా దాడులు జరగకుండా ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది. ఈ తరుణంలో అమెరికా 33 మిసైల్ సైట్లలో దాదాపు 30ను తిరిగి కార్యకలాపాలు ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 70 శాతం మొబైల్ మిసైల్ లాంచర్లను మోహరించింది. ఇది ఇరాన్ ఎదురుదాడి సామర్థ్యాన్ని ఇప్పటికీ కాపాడుకోవాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. మరోవైపు అమెరికా దాడులు ఇరాన్‌ను మరింత ఒత్తిడికి గురి చేసి చర్చల టేబుల్ వద్ద రాజీకి సిద్ధం చేయడానికి ఉద్దేశించినట్లు కనిపిస్తోంది. ఈ ద్వంద్వ వ్యూహం (దాడి + దౌత్యం) మధ్యప్రాచ్య రాజకీయాల సారాంశాన్ని బయటపెడుతోంది. స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమ నియంత్రణ, ప్రాంతీయ స్థిరత్వం- ఇవన్నీ అమెరికా స్ట్రాటజిక్ లక్ష్యాలు. ఇరాన్ మాత్రం ఆర్థిక ఒత్తిడి, సైనిక నష్టాల నుంచి బయటపడి తన ప్రాంతీయ ప్రభావాన్ని కాపాడుకోవాలని చూస్తోంది. ఈ చర్చలు విజయవంతమైతే మధ్యప్రాచ్యంలో కొత్త శాంతి అధ్యాయం మొదలవుతుంది. ఇరాన్ ఆయిల్ ఎగుమతులు సాఫీగా జరగడం, ఆర్థిక ఉక్కిరిబిక్కిరి తగ్గడం, ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గడం వంటి సానుకూల ఫలితాలు వస్తాయి. కానీ ఒప్పందం కుదరకపోతే ఉద్రిక్తతలు మరింత పెరిగి పెద్ద యుద్ధంగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం రెండు వైపులా "ఒప్పందం కావాలి" అన్న కోరిక కనిపిస్తోంది. అయితే షరతులు, అణు అంశాలు, సైనిక నియంత్రణ వంటి విషయాల్లో ఇంకా తీవ్ర అసమ్మతి నెలకొని ఉంది. దోహా చర్చల ఫలితాలు రాబోయే రోజుల్లో ప్రపంచ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపించవచ్చు.

## కోప్టా చట్టం అమలును పటిష్టంగా చేపట్టాలి



### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,మే 29:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో కోప్టా చట్టం-2003 అమలును పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీతో కలిసి ఎన్‌టీసీపీ అండ్ కోప్టా చట్టం అమలుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ కోప్టా చట్టం అమలు అత్యంత అవసరమని, అన్ని శాఖలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలను పొగాకు రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలల సమీపంలో ఉన్న దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. పోలీసు శాఖ సహకారంతో జూనియర్ కళాశాలలు, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు వంటి ప్రజా ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై వెంటనే జరిమానాలు విధించాలని తెలిపారు. అదే తప్పును పునరావృతం చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రతి నెలా గ్రౌండ్ లెవల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చట్ట అమలును పర్యవేక్షించాలని సూచించారు. అన్ని పొగాకు ఉత్పత్తులపై ఆరోగ్య హెచ్చరికలు తప్పనిసరిగా ఉండాలని, కోప్టా చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక సాధికారికత సాధించాలి

### - మెట్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారపు లింబాద్రి



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 29 (ప్రజా కలం) మహిళలు ఆర్థిక సాధికారికత సాధించాలని మెట్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారపు లింబాద్రి పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళా వారోత్సవాలు నిర్వహించారు. మెట్ పల్లి పట్టణ మహిళా సంఘాలకు బ్యాంకు రుణ మేళ నిర్వహించి అర్హులైన మహిళా సంఘాల సభ్యులకు రెండు కోట్ల 9 లక్షల రూపాయల జంబో చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా మైలారపు లింబాద్రి మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులు బ్యాంక్ రుణాలు పొంది క్రమశిక్షణతో రుణాలతో ఆర్థిక అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధించినప్పుడే ఇంటిల్లిపాది అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతారని, ఇవే కాకుండా బ్యాంకు రుణాలు పొంది వారు ఎన్నుకున్న రంగాలలో వ్యాపారాలు విస్తరించి పలువురికి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. వైస్ చైర్మన్ నవీన్ మాట్లాడుతూ బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగాలన్నారు. మూడవ వార్డు కౌన్సిలర్ నరేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మహిళా సంఘ సభ్యులు మెప్మా ఆర్పి లపైన ఉన్నదన్నారు. శ్రీనిధి లోన్ల రికవరీలో రాష్ట్రస్థాయిలో రెండవసారి అవార్డు పొందిన పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బబ్బూరి లక్ష్మి, కార్యదర్శి చెరుకూరి పద్మ, అధికారి వాసుల సుజాత లను చైర్మన్ లింబాద్రి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, వార్డు కౌన్సిలర్లు, డిఎంసీ సునీత, టీఎంసీ జ్యోతి మహిళా సంఘ సభ్యులు రిసోర్స్ పర్సన్లు మహిళలు పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపును నిరాకరించడం విచారకరం : టిఎస్ యుటిఎఫ్

జగిత్యాల్ ప్రతినిధి మే 29 (ప్రజా కలం)

2010 ఆగస్టు 23 కు ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలన్న అభ్యర్థనను తిరస్కరించడం విచారకరమని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి తిరుకోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేష్వర్ విచారం వ్యక్తచేశారు. టెట్ ను ఆరు నెలలకు ఒకసారి చొప్పున వీలైనన్ని ఎక్కువ సార్లు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఉద్యోగ విరమణకు ఐదు సంవత్సరాలకు పైబడిన సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు అందరూ రెండేళ్ళలో తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులవ్వాలని సుప్రీంకోర్టు గత సంవత్సరం సెప్టెంబర్ 1వ తేదీన ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ టి ఎఫ్ ఐ) తదితర ఉపాధ్యాయ సంఘాలు, తెలంగాణతో సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. మే 13 వ తేదీన వాదనలు జరిగి తీర్పు రిజర్వ్ చేయబడింది. ఈరోజు (29.05.2026) జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్ లతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. రివ్యూ పిటిషన్లన్నింటినీ తిరస్కరించింది. గత పదిహేను సంవత్సరాలుగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని ఎన్సీటిఈ, రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మినహాయింపును నిరాకరించడం హేయమన్నరు.

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పార్లమెంట్ లో విద్యాహక్కు చట్టం సెక్షన్ 23 ను సవరించి ఉపాధ్యాయుల సర్వీసుకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్

గద్వాల ప్రతినిధి మే 29 (ప్రజా కలం న్యూస్) తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్ లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించే వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ముఖ్య అతిథిలు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తుగా మాక్ డ్రిల్ నిర్వహించడంతో పాటు పోలీసు గౌరవ వందనం ఏర్పాటు చేయాలని, బందోబస్తు కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేడుకల్లో ప్రతిబింబించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ



శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రదర్శన స్టాళ్లను ఆకర్షణీయంగా, వినూత్నంగా ఏర్పాటు చేసిన ఉత్తమ శాఖలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలులో విశేష కృషి చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, అధికారులను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మండలాలు, గ్రామ స్థాయిలో కూడా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు.

జిల్లా, మండల, గ్రామ స్థాయిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించి పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాకేంద్రంలోని స్మృతి వనం, పాత బస్టాండ్ వద్ద గల తెలంగాణ పోరాట యోధుల విగ్రహాల వద్ద, సభాస్థలి వేదికలను పూలతో అందంగా అలంకరించాలన్నారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నర్సింగ రావు, మధు మోహన్, ఆర్డిఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎఓ భూపాల్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ల సమస్యలపై సమరభేరి

### - ఈ నెల 30న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో మహాధర్నా
### - గోడ పత్రులను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని,మే 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నా వాల్ పోస్టర్‌ను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన, నిరుపేద వర్గాలైన బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ కాంట్రాక్టర్లకు ప్రభుత్వ పనుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సముచిత అవకాశాలు కేటాయించినప్పుడే సామాజిక సమానత్వం సిద్ధిస్తుందని అభిప్రాయపడ్డారు. కాంట్రాక్టర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం జేఏసీ నేతృత్వంలో సాగుతున్న ఈ పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని, ఈ మహాధర్నాను కాంట్రాక్టర్లందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ మోలుమూరు శేఖర్, ఉద్యమకారుల ఫోరం రామగుండం ఇంచార్జ్ నూతి తిరుపతి, కాంట్రాక్టర్ మిట్టపల్లి రాజమౌళి, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, వాసు, మల్లేష్, సంతోష్, విరాలల్, నిరంజన్, రఘు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో అధికారులకు సన్మానం




మల్లాపూర్ మే 29 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండల ఉప సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ రామచందర్ , ఎంపీడీవో ఆలువాల శ్రీకాంత్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చేస్తున్న సేవలను అభినందిస్తూ ఉప సర్పంచుల ఫోరం సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు గడ్డం సోమరెడ్డి, ఉపాధ్యక్షులు బాల్సని ప్రణయ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బానావత్ శ్రీనివాస్ నాయక్, కార్యదర్శులు తోట రాజు, వంగ పోతయ్య, రత్నాపూర్ ఉప సర్పంచ్ కూచన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంపల్లి పోచయ్యను పరమార్శించిన నాయకులు





ధర్మారం, మే 29 : ( ప్రజా కలం ప్రతినిధి )

ధర్మారం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సీనియర్ దళిత నాయకుడు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు కాంపెల్లి పోచయ్య కు ఇటీవల కుడి చేతికి శాస్త్ర చికిత్స జరుగగా ఆయనను శుక్రవారం రోజున కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాడే సూర్యనారాయణ, అంబెద్కర్, జ్యోతిభాపులే జాతీయ అవార్డు గ్రహీత లు సుంచు మల్లేశం, కొక్కుల రాంనారాయణ, శుక్రవారం రోజున వారి నివాసనికి వెళ్లి పరమార్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసు కున్నారు. ఏఎంసీ డైరెక్టర్ గంధం మహిపాల్, ఎస్సీ సెల్ ఉమ్మడి వెల్గటూర్ మండల అధ్యక్షులు వడకపురం రవి, ధర్మారం వార్డు సభ్యులు దేవి కిషోర్, కొత్తూరు గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మేకల కుమార్, పుల్లకొల్ల ఎల్లయ్య, నేరువట్ల రాజయ్య, బొడ్డు మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం : బిఆర్ ఎస్ నాయకులు అవారి చందు



గొల్లపల్లి మే 29 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వరి ధాన్యం మొక్కజొన్నలు కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగావిఫలం అయిందని బి ఆర్ ఎస్ యూత్ నాయకులు అవారి చందు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఎలాంటి తరుగు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం అనిమోసం చేసిందని లెక్కలేనన్ని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాలు కి 7నుండి 8 కిలోలు తరుగు పేరిట రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం లో కిలోనర తరుగు చేస్తేనే ప్రభుత్వం పై విమర్శలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పుడు 7,8 కిలోలు ఎలా కట్ చేస్తారు అని విమర్శించారు. వరి వేస్తే కేంద్ర ప్రభుత్వం కొనడం లేదు అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం మరి మొక్క జొన్న వేస్తే వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శించారు. మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రంలలోనే మగ్గుతున్నాయన్నారు. వచ్చే సీజన్ లో సన్న రకాలు మాత్రమే పెట్టాలి అనడం సరైంది కాదని రైతుకు తాను పండించే పంటని కూడా ప్రభుత్వలే చెప్తే, రైతు ధాన్యం పండించడం ఎందుకు అని అన్నారు. ఇప్పటికీ అయినా రైతులు పండించిన ధాన్యం త్వరగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. అకాల వర్షం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పై రైతులకు తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

శనివారం
మే 30, 2026
ప్రజా కలం
5

# వైద్యుల సలహాలు తీసుకోవాలి

## - కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 29 (ప్రజా కలం) వెన్నెముక సమస్యలు తలెత్తినప్పుడు తప్పనిసరిగా వైద్యుల సలహాలు సూచనలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. శుక్రవారం నాడు ఆయన నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు వెన్నుముక సమస్యలతో బాధపడుతుండగా మెట్పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కొంతమంది రిపోర్టులను పరిశీలించారు. వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన మందులు శస్త్ర చికిత్సలు జరిపించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనారోగ్య సమస్యలు ఏమైనా తనను సంప్రదించి సలహాలు తీసుకోవచ్చని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సందర్భంగా అవసరమైన కొందరికి మందులు అందజేశారు. అంతేకాకుండా కొంతమందికి ఆసుపత్రులకు సిఫారసు లేఖలు రాశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, పూదారి సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## - వెండి బంగారు వర్తక సంఘం ఆధ్వర్యంలో సి ఐ సురేష్ బాబు కు సన్మానం.




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 29 (ప్రజా కలం) అపరిచిత వ్యక్తుల పట్ల స్వర్ణకారులు అప్రమత్తంగా ఉండాలని మెట్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సురేష్ బాబు తెలిపారు. మెట్ పల్లి సిఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్ బాబు ను పట్టణంలోని సర్కిల్ ఆఫీసులో మెట్ పల్లి వెండి, బంగారు వర్తక సంఘం అధ్యక్షులు బిజ్జారపు నవీన్ ఆధ్వర్యంలో సిఐని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ స్వర్ణకార దుకాణాలకు అపరిచిత వ్యక్తులు వస్తే అప్రమత్తంగా ఉండాలని,అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వెండి బంగారు వర్తక సంఘం కార్యదర్శి తిప్పర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు గాలిపెల్లి నాగరాజు, కోశాధికారి ఐల్లేందుల ఉదయ్,కార్యవర్గ సభ్యులు నాంపల్లి పవన్ కుమార్, తుమ్మనపల్లి మారుతి, ఇల్లేందుల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్



గద్వాల జిల్లా ప్రతినిధి మే 29 (ప్రజా కలం న్యూస్)

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం పరిధిలోని భీంపురం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు కప్పి ఉంచాలన్నారు. కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు తేమ శాతంను పరిశీలించి ఎప్పటికప్పుడు తూకం చేసి మిల్లులకు తరలించాలని సంబంధిత కేంద్రం ఇన్చార్జీలకు సూచించారు. లారీల కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా ధాన్యం కొనుగోలు చేసిన రోజే ఓపిఎంఎస్ ను ఆన్లైన్లో ఎంటర్ చేయాలని ఆదేశించారు. అలాగే గన్ని సంచులు కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ధరూర్ తహసిల్దార్ నందిని, కేంద్రం సిబ్బంది, తదితరులున్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ పథకాల ఎంపికలో పారదర్శకత

## - వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారుల ఇంటర్వ్యూలు.

మే 29 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్దన్నపేట) వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందజేయబడుతున్న పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఇసంపెల్లి జోనా ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం 27 మంది దరఖాస్తుదారుల అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కమిషనర్ తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అధికారి, మున్సిపల్ అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.



# చదువులో రాణిస్తే ఆకాశ వీధిలో విహారం

## - ప్రభుత్వ బడి పిల్లల ప్రతిభకు విమానమంత బహుమతి
## - బేగంపేట్ మాస్టారి గురుతర సేవలకు కమిషనర్ జేజేలు

పెద్దపల్లి మే 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు మల్కా రామకిషన్ రావు విద్యా రంగంలో చూపిస్తున్న అంకితభావాన్ని,ఆయన చేపట్టిన వినూత్న ప్రయోగాలను తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మరియు సంచాలకులు ఈ.నవీన్ నికోలన్ ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఉపాధ్యాయుడి విద్యా సేవల గురించి తెలుసుకున్న కమిషనర్,శుక్రవారం రామకిషన్ రావును హైదరాబాదులోని తన ప్రధాన కార్యాలయానికి పిలిపించి ముఖాముఖి మాట్లాడారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో 550 మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ,వారిలో చదువు పట్ల మరింత ఆసక్తిని కలిగించడానికి రామకిషన్ రావు తన సొంత ఖర్చులతో వారిని విమానంలో తీసుకువెళ్లడం విశేషం. దీనితో పాటు గత రెండు సంవత్సరాలుగా విద్యార్థుల్లో పుస్తక పఠనంపై మక్కువ పెంచేందుకు తరగతి గదుల్లో ప్రత్యేకంగా పఠన కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి అనేక కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సాగుతున్న వివిధ విద్యా కార్యక్రమాల గురించి కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. గత రెండు సంవత్సరాల నుండి బేగంపేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ



మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ,అక్కడి ఉపాధ్యాయ బృందాన్ని మనస్ఫూర్తిగా కొనియాడారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో తానే స్వయంగా ఈ పాఠశాలను సందర్శిస్తానని హామీ ఇస్తూ, ఉపాధ్యాయులందరూ మరింత బాధ్యతాయుతంగా పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కాగా, గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు రామకిషన్ రావును జిల్లా విద్యాధికారి శారద,సహాయ పర్యవేక్షణ అధికారి పీఎమ్ షేక్ ప్రత్యేకంగా అభినందించారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## - అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు
## - బాల్య వివాహాల నిరోధక చట్టం పై అవగాహన సదస్సు



పెద్దపల్లి,మే 29:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు,సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో కృషి చేయాలని అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పెద్దపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు బాల్య వివాహాల నిరోధక చట్టం పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే చట్టపరమైన ఇబ్బందులు,బాలికల ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాల గురించి గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే అడ్డుకోవాలని,చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జెడ్పీ సీఈఓ శ్రీ సంజీవరావు, సూపరింటెండెంట్ రమేష్,జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్ రావు,సీడీపీఓ శ్రీమతి కవిత,డీసీపీఓ జితేందర్ పాల్గొని బాల్య వివాహాల నిరోధానికి తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలపై పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. ఈ సదస్సులో జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణతో పాటు కనకరాజు,సతీష్,సమత,స్వర్ణ,విజయ మరియు జిల్లా లోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# యశోద హాస్పిటల్ హైదరాబాద్ సోమాజిగూడ లో గ్యాస్ట్రిక్ క్యాన్సర్ కు అరుదైన శస్త్ర చికిత్స

ఖమ్మం మే 29(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ డాక్టర్ లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జన్ వై శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఇటీవలే ఖమ్మం ప్రాంతానికి చెందిన ఒక పేషెంట్ పిత్తాశయం క్యాన్సర్ తో యశోద హాస్పిటల్ ను సంప్రదిస్తే ఆమెకు లివర్ ఫంక్షన్ టెస్ట్ లు చేసి అడ్వాన్స్ లాపరోస్కోపిక్ , రోబోటిక్ సర్జరీ తో అరుదైన శస్త్ర చికిత్స అందించామని పేర్కొన్నారు. గాలి బ్లాడర్ లో ఎక్కువ రోజులు స్టోన్స్ పెట్టుకున్న ఈ సమస్య వస్తుందని అన్నారు . ఈరోజుల్లో గ్యాస్ట్రిక్ క్యాన్సర్లు చాలా ఎక్కువగా ఉన్నాయని , సమయానికి ఆహారం తీసుకోకపోవడం వల్ల , జంక్ ఫుడ్ , సిగరెట్స్ మద్యపానం మరి కొంతమందికి వారసత్వంగా ఆడవాళ్లకు మగవాళ్లకు అందరికీ వస్తుందని తెలిపారు . వారసత్వంగా వచ్చే క్యాన్సర్లు ఈ జనరేషన్ వాళ్ళు కూడా వచ్చే అవకాశలు ఎక్కువ ఉన్నాయి . తక్కువ వయసు వాళ్లకు కూడా వస్తాయి . కొంతమంది ఫాస్టింగ్ చేసి వెయిట్ లాస్ అయ్యే వాళ్లకు మరియు ఫ్యామిలీ హిస్టరీ ఉండేవాళ్లు ఎక్కువ అవకాశలు ఉన్నాయన్నారు . వాళ్ల పేరెంట్స్ కి ఎప్పుడైతే క్యాన్సర్ వచ్చిందో టెన్ ఇయర్స్ ముందే రెగ్యులర్ గా ఫాలోఅప్ చేసుకోవాలి . 5 ఇయర్స్ కి ఒకసారి ఎండోస్కోప్ , రెగ్గర్ అల్ట్రా సౌండ్ టెస్టులు




చేయించుకుని ఫాలో అప్ చేసుకుంటే సింపుల్గా కంట్రోల్ చేసుకోవచ్చు . రెగ్యులర్ గా కడుపునొప్పి , బరువు తగ్గటం , ఆకలి లేకపోవడం , వాంతులు అవ్వడం లక్షణాలు ఉంటే అడ్వాన్స్ స్టేజ్ లో ఉన్నట్టు . వెంటనే సంబంధించిన డాక్టర్ ను సంప్రదించాలని అన్నారు . పేగు సర్జరీ చేస్తే మూడు నాలుగు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారు . మోస్ట్ డేంజర్ గాలి బ్లాడర్ క్యాన్సర్ . అవుట్ సైడ్ ఫుడ్ మ్యాగ్జిమం అవాయిడ్ చేయాలి . నిద్ర మంచిగుండాలి , ఎక్కువ స్ట్రెయిన్ పడొద్దు మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండాలి . మన యశోద హాస్పిటల్ హైదరాబాద్ సోమాజిగూడ లో అడ్వాన్స్ కీమోథెరపీ , రేడియోథెరపీ మరియు అన్ని విధాల క్యాన్సర్లకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సదుపాయం అందుబాటులో ఉంది అని అన్నారు . ఈ కార్యక్రమంలో . శ్రీధర్ రావు , నాగార్జున , బాల కృష్ణ పాల్గొన్నారు .

# జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ , మే 28(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, దళారులకు జొన్నలు విక్రయించి నష్టపోవద్దని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు, భైంసా పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్, చైతన్య మండల మహిళా సమాఖ్య భైంసా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంతో పాటు, కుభీర్ మండల కేంద్రంలో కుభీర్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు క్వింటాల్‌కు రూ.3,699 కనీస మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని



తెలిపారు, రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తమ పంటను తీసుకురావాలని సూచించారు,ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు పారదర్శకంగా చెల్లింపులు జరుగుతాయని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు, అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ ,ఎపీయం, స్థానిక ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దగ్ధమైన ఈత వనాలను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 29 (ప్రజాకలం) మండలంలోని మెట్ల చిట్టాపూర్, పెద్దాపూర్ గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో భారీ ఎత్తున ఈత వనాలు దగ్ధమవడంతో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా దగ్ధమైన ఈత వనాలను పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్, అగ్ని ప్రమాదం వల్ల జరిగిన నష్టంపై బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్షణ సహాయం



కింద రెండు గ్రామాలకు ఇరవై వేల చొప్పున సహాయం అందించారు. ఎన్నో సంవత్సరాల శ్రమతో పెంచుకున్న ఈత చెట్లు అగ్నికి ఆహుతి కావడం బాధాకరమని, ఈ ఘటన వల్ల గౌడ కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. ప్రభుత్వం పరంగా అందాల్సిన సహాయాన్ని అందించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నష్టపోయిన వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. ఈత వనాలు జీవనాధారంగా ఉన్న కుటుంబాలు ఆందోళన చెందవద్దని, తాను ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటానని భరోసా ఇచ్చారు. అగ్ని ప్రమాదాలకు గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు.

# పిడుగుపాటుకు రెండు కాడెద్దుల మృతి



గద్వాల ప్రతినిధి మే 29 (ప్రజా కలం న్యూస్)

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని సద్దలోనిపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం 5: 30 రెండు కాడెద్దుల మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బంట్రోత్ కుశీలన్న అనే రైతు ప్రతినిత్యం లాగానే తన గుడిసెలో ఉండే ఎద్దులను చెట్టు క్రింద తాడుతో కట్టేసి వెళ్ళిపోయాడు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పాటు సమీపంలో పిడుగు పడడంతో ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. రెండు కాడెద్దుల విలువ 1,50,000 ఉంటుందని బాధితుడు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బెల్లం నరసింహులు మాట్లాడుతూ... గ్రామంలో ఎప్పుడు ఇలాంటివి జరుగలేదు. కానీ రైతు కుటుంబానికి జీవనాధారమైన రెండు కాడెద్దులు మృతి చెందడంతో బాధాకరమని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతుకు నష్టపరిహారం క్రింద ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని తెలిపారు.

# సద్దలోని పల్లిలో చిన్న వర్షానికే రోడ్లపై చిత్తడే చిత్తడి -పట్టించుకోని అధికారులు



గద్వాల జిల్లా ప్రతినిధి మే 29 ( ప్రజా కలం న్యూస్)

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని సద్దాలోని పల్లి గ్రామంలో వర్షం పడితే చాలు రోడ్లపై నీరు నిలిచి చిత్తడిగా మారుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం కురిసిన కొద్దిపాటి వర్షానికి గ్రామంలోని ప్రధాన రహదారిపై నీరు నిలవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని అధికారులకు గ్రామస్తులు కోరుతున్నారు.

# జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

గద్వాల జిల్లా ప్రతినిధి మే 29 (ప్రజా కలం న్యూస్)

జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని, శుక్రవారం అలంపూర్ మున్సిపాలిటీ కేంద్రంలో అలంపూర్ మండల సమైక్యలోని జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. హింసకు గురైన మహిళలకు, బాలికలకు అవసరమైన సేవలన్నింటిని అందిస్తుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ బాలికలు, స్త్రీలపై జరిగే హింసను ఆపుదాం. వారికి అండగా ఉందాం అని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్,మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్ లు, మహిళ సమైక్య అధికారులు,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జీనియస్ వరల్డ్ రికార్డులో కుక్కునూరు బాలుడు

### - ఏకకాల పియానో సంగీత ప్రదర్శనలో పాల్గొని వరల్డ్ రికార్డులో భాగస్వామ్యం
### - వరల్డ్ రికార్డు సాధనలో ప్రత్యేకశైలి అనుసరించిన మోక్షిత్

ప్రజాకలం ప్రతినిధి,కుక్కునూరు మే 29

కుక్కునూరు మండలంలోని వెంకటాపురం బాలుడు శెట్టి మోక్షిత్ రిషి నిహార్ అరుదైన ప్రతిభను చాటుతూ జీనియస్ వరల్డ్ రికార్డ్ లో చోటు సంపాదించారు. తొమ్మిదవ తరగతి చదువుతున్న మోక్షిత్ సంగీత రంగంలో ప్రతిభను చాటుతూ ప్రత్యేక గుర్తింపు పొందాడు. వెంకటాపురం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ గోపి – మేరీ దంపతుల ద్వితీయ కుమారుడు ఫిబ్రవరిలో హైదరాబాదులో నిర్వహించిన భారీ సంగీత ప్రదర్శన వివిధ దేశాలకు చెందిన సంగీత కళాకారులు 2000 మంది భాగస్వామ్యం కావడం జరగగా ఈ బహుత్కర కార్యక్రమం వరల్డ్ రికార్డులో చోటు సంపాదించింది. మోక్షిత్ ఈ సంగీత కార్యక్రమం లో ప్రతిభచాటగా ఇంటర్నేషనల్ మ్యూజిక్ స్కూల్ అధినేత అగస్టీన్ దండంగి చేతులు మీదుగా వరల్డ్ రికార్డ్ ప్రతిభాపత్రాన్ని అందుకున్నారు.

గురువారం హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ ప్రతిభ పత్రాన్ని అందుకోవడం అలాగే ఈ బాలుడు గత ఏడాది గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించడం ఇటువంటి పలు రికార్డుల్లో చోటు సంపాదించడం విశేషం. ఈ చిన్న వయసులోనే అద్భుతమైనటువంటి ప్రతిభతో సాగుతున్న ఈ బాలుడికి ఉపాధ్యాయులు గ్రామస్తులు నాయకులు ప్రశంసలు కురిపిస్తూ రాబోయే కాలంలో గొప్ప స్థాయిలో ఉండాలని ఆశీర్వదించారు.




# కూసుమంచిలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

పాలేరు మే 29( ప్రజా కలం న్యూస్ )

కేరళ మాజీ ముఖ్యమంత్రి సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు పినరై విజయన్ మరో 10 మంది ఇండ్లపై కేంద్ర బిజెపి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ. ఈడి సంస్థలతో దాడులు చేయించడం దుర్మార్గపు చర్య అని, ఇలాంటి చర్యలకు సిపిఎం పార్టీ భయపడేది లేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో నుండి ఈడి దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేరళ రాష్ట్రంలో ఎన్నికల ముందు బిజెపి కాంగ్రెస్ పార్టీలు కలిసి ఉమ్మడిగా పినరై విజయన్ పై తప్పుడు ప్రచారం చేశారని, ఎన్నికల అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ కేరళ ముఖ్యమంత్రి సతీష్ న్ ఢిల్లీలో చర్చలు జరిపిన అనంతరం కేరళ మాజీ ముఖ్యమంత్రి విజయన్ ఇంటిపై దాడులు చేయించడం జరిగిందని అన్నారు. ఇది రాజకీయంగా కేంద్రంలో బిజెపి, రాష్ట్ర కాంగ్రెస్ ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడ్డారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి




రాజశేఖర్, పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు బిక్కసాని గంగాధర్ శీలం గురుమూర్తి, యడవల్లి రమణారెడ్డి మండల కమిటీ సభ్యులు చీర్ల రాధాకృష్ణ, జవ్వాజి శ్రీను, కర్ణ బాబు, మూడు గన్య నాయక్, గుగులోత్ నాగేశ్వరరావు, నిమ్మల ఉపేందర్,అలేటి వీరబాబు, వీరేందర్, నాగరాజు. తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రజ్యోతి సీనియర్ పాత్రికేయులు శ్రీరామ్ రమేష్ హఠాన్మరణం

### - అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించిన టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్
### - పాత్రికేయుడి పాడే మోసి మానవత్వం చాటిన టీపీసీసీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు



మే 29 ఐనవోలు :– (ప్రజా కలం ప్రతినిధి )

వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన ఆంధ్రజ్యోతి సీనియర్ పాత్రికేయులు శ్రీరామ్ రమేష్ హఠాన్మరణం జరగడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఎన్నో సంవత్సరాలుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ పాత్రికేయ రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రమేష్ ఆకస్మిక మరణవార్త సహచర పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను దిగ్భ్రాంతికి గురిచేసింది. రమేష్ అంతిమయాత్రలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రమేష్ నిజాయితీ గల పాత్రికేయుడిగా సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సమస్యలపై ఆయన రాసిన కథనాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు. పాత్రికేయ లోకానికి రమేష్ మృతి తీరని లోటని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు.

# ఎస్ఐఆర్ పకడ్బందీగా చేపట్టాలి

### - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి



నిర్మల్ , మే 28(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు, శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్–2026 పురోగతిపై సమీక్షించారు, ఈ సందర్భంగా సి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు, బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేసి, పూర్తి చేసిన వివరాలను సేకరించాలన్నారు, ఓటర్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లోనే తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు, సూపర్వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు,రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు, అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు, సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు,ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఏఈఆర్వోలు (అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు), ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక చికిత్సతో ప్రాణాపాయ స్థితి నుంచి రోగిని కాపాడిన మెడికవర్ వైద్యులు

హనుమకొండ మే 29 ప్రజా కలం ప్రతినిధి

పాత క్షయవ్యాధి (ట్యూబర్‌కులోసిస్), క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ),గతంలో స్ట్రోక్ (సీవీఏ) చరిత్ర ఉన్న ఓ వృద్ధ రోగి తీవ్ర ప్రాణాపాయ పరిస్థితిలో వరంగల్ మెడికవర్ హాస్పిటల్ ను సంప్రదించారు. ఈ రోగికి ఒక్కసారిగా సుమారు 200 మిల్లీలీటర్ల తాజా రక్తంతో కూడిన తీవ్రమైన దగ్గు (మాసివ్ హీమోప్టైసిస్) రావడంతో పరిస్థితి విషమంగా మారిందనీ వెంటనే స్థిరపరిచి ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)కు తరలించి చికిత్స ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కాంట్రాస్ట్ సీటీ స్కాన్‌లో పాత క్షయవ్యాధి కారణంగా ఊపిరితిత్తుల్లో ఏర్పడిన మార్పులతో పాటు రైట్ ఇంటర్‌కోస్టోబ్రోంకియల్ ట్రంక్,రైట్ ఇంటర్నల్ మ్యామరీ ఆర్టరీ, రెండు దిగువ ఊపిరితిత్తుల బ్రోంకియల్ ఆర్టరీలు అసాధారణంగా విస్తరించి,వంకరలుగా మారినట్లు వైద్యులు గుర్తించారు. ఇంటర్వెన్షనల్ రేడియాలజీ మరియు ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ విభాగాల నిపుణులు కలిసి రోగికి బ్రోంకియల్ ఆర్టరీ ఎంబోలైజేషన్ అనే అత్యాధునిక చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రక్రియలో రక్తస్రావానికి కారణమైన అసాధారణ రక్తనాళాలను ప్రత్యేక పద్ధతిలో మూసివేయడంతో రక్తస్రావం పూర్తిగా నియంత్రణలోకి వచ్చింది. తదుపరి




నిర్వహించిన డయాగ్నస్టిక్ బ్రోంకోస్కోపీ పరీక్షలో ఇతర సమస్యలు ఏవీ కనిపించకపోవడంతో,పాత క్షయవ్యాధి వల్ల ఏర్పడిన బ్రోంకియెక్టాటిక్ మార్పులు మరియు అసాధారణ రక్తనాళాలే రక్తస్రావానికి కారణమని నిర్ధారించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా కోలుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఈ క్లిష్టమైన కేసును మెడికవర్ హాస్పిటల్ వరంగల్‌లోని ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ విభాగానికి చెందిన Dr. Abhijan ఇంటర్వెన్షనల్ రేడియాలజీ బృందం విజయవంతంగా నిర్వహించారన్నారు.

# గాలికుంటు వ్యాధితో గేదె ప్రాణాపాయ స్థితి

### - టీకా కోసం వేడుకున్నా పట్టించుకోలేదంటూ రైతు ఆవేదన

పాలేరు మే 29(ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండలం పరిధిలోని శుక్రవారం పెరికసింగారం గ్రామపంచాయతీ పరిధిలోని దేవల తండాకు చెందిన రైతు అజ్మీర మంగ్యకు చెందిన చూడు గేదె గాలికుంటు వ్యాధి బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురైంది. సుమారు రూ. 50 వేలకుపైగా విలువ చేసే గేదె ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో రైతు కుటుంబం తీవ్ర ఆందోళన చెందుతోంది.



వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత గోపాలమిత్రకు సమాచారం అందించి టీకా వేయాలని పలుమార్లు కోరినా, “వస్తాం, చూస్తాం” అంటూ కాలయాపన చేశారని రైతు అజ్మీర మంగ్య ఆరోపించారు. సకాలంలో వైద్య సేవలు అందకపోవడంతో గేదె పరిస్థితి మరింత విషమించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశుసంపదే జీవనాధారంగా ఉన్న తమలాంటి చిన్న, సన్నకారు రైతులకు ఒక్క పశువు అనారోగ్యానికి గురైనా భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తు టీకాలు వేయడం, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్య సేవలు అందించడం పశుసంవర్ధక శాఖ బాధ్యత అని గ్రామస్తులు పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి గ్రామంలో ఇతర పశువులకు కూడా వ్యాపించే ప్రమాదం ఉన్నందున వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి టీకాలు వేయాలని, బాధిత రైతుకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య సిబ్బంది పనితీరును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

### ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి - ప్రతి ఇంటికి బీఎల్‌వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి
### డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి అభ్యంతరాలు, క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలి - రాజకీయ పార్టీలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలి
### ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం, మే 29(ప్రజా కలం న్యూస్ )

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు.

శుక్రవారం కలెక్టరేట్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ఇప్పటివరకు చేపట్టిన మ్యాపింగ్ వివరాలను మండలాల వారీగా పరిశీలించి, పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకతతో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్ లో భాగమైన మండలాలు, కార్పోరేషన్, మున్సిపాలిటీ సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్ చేసే విధంగా టార్గెట్ పెట్టుకొని వంద శాతానికి చేరుకోవాలన్నారు.

ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నారన్నారు. ఫారం–6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు. ఓటర్లు అందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని సరైన వివరాలు అందించేలా తద్వారా ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.

బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఆన్‌లైన్ సేవల ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చి, అనర్హులైన ఓటర్ల వివరాలను తొలగించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీలతొలగింపు జరుగుతుందని తెలిపారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తి స్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీఎల్‌వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రతి బీఎల్‌వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.




తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.

అంతకుముందు శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ –2026 ప్రక్రియ నిర్వహణ, శిక్షణ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయక ఎన్నికల నమోదు అధికారులు, బిఎల్ఓలు, సూపర్‌వైజర్‌లతో సహా ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్డీసీ రాజేశ్వరీ, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, అన్సరీ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతులతోపాటు బాధ్యతలు కూడా పెరుగుతాయి

## - వరంగల్ పోలీస్ కమిషనర్

వరంగల్ : పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సిటీ ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన బి. రాజేందర్ ప్రసాద్, కే రమణ చారి శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అధికారులు అప్పగించిన పనులను సమర్థవంతంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. అనంతరం పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లకు సీపీ చేతుల మీదుగా పదోన్నతి చిహ్నిని యూనిఫారంపై అలంకరించారు.

# రూ.3 లక్షలకు ఆడ శిశువు విక్రయం

మెదక్ : మెదక్‌లోని లైఫ్‌కేర్ ఆస్పత్రిలో ఓ నర్సు అప్పుడే పుట్టిన బిడ్డ చనిపోయిందని తల్లిదండ్రులను నమ్మించి శిశువును అమ్మేసిన ఘటన మరువక ముందే మరో దారుణం వెలుగు చూసింది. అప్పటికే ముగ్గురు ఆడపిల్లలు ఉన్న దంపతులకు నాలుగో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టగా వారు ఆ బిడ్డను మధ్యవర్తుల సహాయంతో రూ. 3 లక్షలకు అమ్మేశారు. అంగన్‌వాడీ కార్యకర్త వల్ల ఈ విషయం బయటపడగా.. శిశువు తండ్రి పరారీలో ఉండగా తల్లితో పాటు బిడ్డను కొనుగోలు చేసిన దంపతులు, మధ్యవర్తులు కలిసి తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తాండాకు చెందిన దేవీసింగ్, శిరీష దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. నాలుగో సారి గర్భం దాల్చిన శిరీష్ మెదక్ మాతాశిశు కేంద్రంలో మార్చి నెలలో మళ్లీ ఆడ పిల్లకు జన్మనిచ్చింది. అయితే, సిద్దిపేట జిల్లా అల్లీనగర్‌కు చెందిన కమలమ్మ, లింగయ్య దంపతులకు సంతానం లేరు. వీరు మధ్యవర్తుల ద్వారా దేవీసింగ్, శిరీష దంపతుల నుంచి నవజాత శిశువును రూ. 3లక్షలకు కొనుగోలు చేశారు. ఆ శిశువును తమ వెంట తీసుకెళ్లిపోయారు. అయితే, శిరీష గర్భంతో ఉండగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రం నుంచి సరుకులు తెచ్చుకునేది. ప్రసవం తర్వాత ఆమె వద్ద బిడ్డ లేకపోవడంతో తండా అంగన్‌వాడీ కార్యకర్త గమనించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు సమాచారం అందించింది. వారు తండాలో విచారణ జరపగా శిశువిక్రయం సంగతి తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు విక్రయించిన శిశువును.. శిశు సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన సోనీ అనే మహిళ ఈ శిశువిక్రయానికి మధ్యవర్తిగా వ్యవహరించినట్లు పోలీసులు తేల్చారు.

# ధాన్యం తరలింపులో వేగం పెంచండి

దండేపల్లి : కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం బస్తాలను రైస్ మిల్లుల గోదాములకు వెంటవెంటనే తరలించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మండలం లోని కన్నెపల్లిలో వెంకటేశ్వర్ల, లింగాపూర్‌లో రామ్‌లక్ష్మణ్, లక్ష్మీకాంతపూర్ జయలక్ష్మి, కాసిపేటలో రైస్ మిల్లుల గోదాములను జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి కలెక్టర్ సందర్శించారు. అక్కడ పరిస్థితి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమంలో భాగంగా ధాన్యాన్ని నిబంధనల మేరకు నిల్వ చేయాలని సూచించారు. ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం గోదాములకు తరలించాలన్నారు. రైస్ మిల్లర్లు హమాలీల సంఖ్య పెంచి వెంటవెంటనే ధాన్యం అన్‌లోడింగ్ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యం ఎక్కువ రోజులు కేంద్రంలో ఉంచకుండా, తూకం వేసి ధాన్యం బస్తాలను లారీల ద్వారా గోదాములకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం గోదాంను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఐకేపీ ఏపిఎం లక్ష్మి, రైస్ మిల్లర్లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# విధ్యార్ధులను క్రీడల్లో ప్రోత్సాహించాలి

హైదరాబాద్ : పాఠశాల స్థాయి నుండే విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. సనత్ నగర్ లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో శ్రీరామ్ మెమోరియల్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్ ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పోలీసు అధికారి శ్రీరామ్ జ్ఞాపకార్థంగా ఈ పోటీలను నిర్వహిస్తున్న వారి కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. ముందుగా శ్రీ రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన ఆరోగ్యంగా ఉండటమే కాకుండా దేహదారుడ్యం పెంపొందుతుందని చెప్పారు. విద్యార్థి దశ నుండి ప్రోత్సహించడం వలన భవిష్యత్ లో ఉన్నత స్థాయి చేరుకునే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాలలో ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహిస్తుండగా, మన దేశంలో క్రీడలకు, క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం అందడం లేదని విచారం వ్యక్తం చేశారు. మన దేశంలో అనేక క్రీడలు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం కేవలం క్రికెట్ ను మాత్రమే ఆదరిస్తూ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. కృషి తో మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల అభివృద్ధి కి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రకటించారు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో క్రీడాపోటీలను సాయంత్రం వేళల్లో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# సచివాలయ ఉద్యోగులకు షాక్

కర్నూలు : కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పదిమంది సచివాలయ ఉద్యోగులకు కమిషనర్ చల్లా ఓబులేసు షాకిచ్చారు. కర్నూలు 16,17,43 సచివాలయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఉన్నతాధికారులు సంబంధిత సచివాలయాల పరిధిలో బుధ, గురువారాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన మంత్రితో అక్కడి స్థానికులు వార్డు సచివాలయ సిబ్బంది తమకు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదు చేశారు. 6వ వార్డు పరిధిలోని 16వ సచివాలయాన్ని మంత్రితో పాటు కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ అక్కడి సచివాలయ సిబ్బంది ప్రతి రోజు నమోదు చేసే హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. కార్యాలయం పని వేళల్లో ఎక్కడికి వెళ్లారని అక్కడ ఉన్న ఒక ఉద్యోగిని అడగ్గా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో కార్యాలయంలోని లేని ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీ చేయాలని మంత్రి కమిషనర్‌ను ఆదేశించారు. వార్డు సచివాలయాల్లో గత ప్రభుత్వ హయాంలోని పథకాల కరపత్రాలు, వైఎస్ జగన్ ఫొటోలతో కూడిన బ్యాగులను చూసిన మంత్రి టీజీ భరత్ అసహనం వ్యక్తం చేశారు. అసలు వార్డు సచివాలయ సిబ్బందిని పర్యవేక్షించాల్సిన నోడల్ అధికారులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. జోహరాపురం, గడ్డవీధి, ఏ.క్యాంపు ప్రాంతాల్లో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కాని సచివాలయ సిబ్బంది జాబితాను పంపాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# రాముని చెరువును కాపాడుకోవాలి

మంచిర్యాల : రాముని చెరువు కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని బీజేపీ నాయకుడు తుల మధుసూదన్‌రావు పేర్కొన్నారు. రాముని చెరువు కట్టపైన, కట్ట అభివృద్ధి పనులపై జరుగుతున్న అవకతవకలపై నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద చెరువుల పరిరక్షణ కోసం రాముని చెరువుకు రూ. 1.98 కోట్లు మంజూరు చేసిందన్నారు. వాటిని అధికారులు అవసరం ఉన్న చోట ఖర్చు పెట్టకుండా అనవసర ఖర్చులు పెడుతున్నారని విమర్శించారు. ఒక పక్క చెరువు ఉనికి ప్రమాదకరంగా మారి హైటెక్ సిటీ వైపు చెరువును కొద్దికొద్దిగా పూడ్చే కార్యక్రమాన్ని కొందరు అక్రమార్కులు చేపడుతుండగా దాన్ని అధికారులు అడ్డుకోవడం లేదన్నారు. మరోపక్క హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు రాముని చెరువులోని కొంత భాగాన్ని ఇస్తున్నామని అధికారులు ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుకు తాడిచెర్ల భూనిర్వాసితుల కృతజ్ఞతలు



మల్హర్, మే 29 ప్రజాకలం ప్రతినిధి

మండల కేంద్రమైన తాడిచెర్ల ఓసిపి డేంజర్ జోన్‌లోని గృహాల సేకరణ కోసం రూ. 261 కోట్లు మంజూరు చేయించి, భూ నిర్వాసితుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు తాడిచెర్ల భూ నిర్వాసితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం కాటారం మండలంలోని మంత్రి స్వగ్రామం ధన్వాడలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబును కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భూనిర్వాసితులు మాట్లాడుతూ.. తాడిచెర్ల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను మంత్రి శ్రీధర్ బాబు నిలబెట్టుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా తాడిచెర్ల ఓసీపీ దుమ్ము, ధూళితో నరకం చూస్తున్న తమకు, మాట ఇచ్చిన ప్రకారం నిధులు మంజూరు చేయించి న్యాయం చేసినందుకు మంత్రికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న నిబద్ధతకు ఈ నిధుల విడుదలే నిదర్శనమని కొనియాడారు. ఈ కృతజ్ఞతా కార్యక్రమంలో తాడిచెర్ల భూనిర్వాసితుల సంఘం అధ్యక్షులు దండు రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బడితల రాజయ్య, మాజీ సర్పంచ్ దన్నపనేని అశోక్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఇందారపు చంద్రయ్య, భూ నిర్వాసితుల ఆర్గనైజింగ్ సెక్రటరీ తాండ్ర మల్లేష్, పైడాకుల బిక్షపతి, తాడిచెర్ల వార్డు సభ్యులు తిర్రి అశోక్ గౌడ్ , వొన్న తిరుపతిరావు, నాయకులు ఇందారపు శివ, రావుల ఆంజనేయులు, దన్నపనేని సురేష్ రావు, పైడాకుల సమ్మయ్య, ఇందారపు ప్రభాకర్, బీర్నేని దుర్గ ప్రసాద్, ఆకుల రాకేష్, మమత, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఫోరం సదస్సును విజయవంతం చేయండి

### - టియూఎఫ్ జిల్లా అధ్యక్షులు గట్టయ్య, ప్రధాన కార్యదర్శి ముడితనపల్లి ప్రభాకర్
### - ముఖ్య అతిథులుగా హాజరుకానున్న 'కేకే కమిటీ' సభ్యులు
### - మే 31న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సమావేశం

మల్హర్.మే 29 ప్రజాకలం ప్రతినిధి...

ఈ నెల 31న ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్న "తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధుల సదస్సు"ను విజయవంతం చేయాలని భూపాలపల్లి జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు యాదండ్ల గట్టయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్ లు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రభుత్వం నియమించిన 'కేకే కమిటీ' సభ్యులు హాజరుకానున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ కోసం జీవో నెంబర్ 679 విడుదల చేసి, ప్రత్యేకంగా 'కేకే కమిటీ'ని ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



రాష్ట్రంలో ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం మరింత వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి తగిన విధంగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఫోరం పరిధిలోని 33 జిల్లాల్లో పదవీ బాధ్యతలు తీసుకున్న ఉద్యమకారులు, ఉద్యమ మహిళలు, జిల్లా, మండల స్థాయిల్లోని ముఖ్య నేతలు అందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# అన్నారం సబ్ స్టేషన్ కు అంటుకున్న మంటలు



( వరంగల్/ పర్వతగిరి) మే 29, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంటలు అంటుకున్నాయి. రైతులు పంట వ్యర్థలను కాల్చే క్రమంలో గాలివీయడంతో వ్యర్థాలతో పాటుగా సబ్‌స్టేషన్ ఆవరణలోకి చేరి మంటలు చెలరేగాయి. ట్రాన్స్ఫార్మర్ల ప్రాంతానికి కూడా మంటలు చేరుకోవడంతో విద్యుత్ సిబ్బంది విద్యుత్తును నిలిపివేసి ఫైర్ ఇంజన్ కోసం ఫోన్ చేశారు అయినా ఫైర్ ఇంజన్ రాకపోవడంతో సిబ్బంది నీళ్లతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ మంటలలో కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అయ్యే వైర్లు దద్దమైనట్టుగా తెలుస్తోంది.

కన్నెబోయిన మల్లయ్య అనే రైతు ప్లాస్టిక్ పైపులు దగ్ధం.

పర్వతగిరి మండలం అన్నారం విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో అన్నారం గ్రామానికి చెందిన కన్నెబోయిన మల్లయ్య అనే రైతు భూమి సబ్ స్టేషన్కు ఆనుకుని ఉంటుంది. అగ్నిప్రమాదంలో మల్లయ్య కు చెందిన 30 నీటిని పారించే ప్లాస్టిక్ పైపులు దగ్ధమయ్యాయి. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ తనకు ఈ ప్రమాదం వలన 30 వేల రూపాయల నష్టం జరిగిందని తనకు నష్టపరిహారం ఇప్పించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

దానయ్య విద్యుత్ డి ఈ. వివరణ.

ప్రమాదవశాత్తు నిప్పు చుట్టుపక్కల వ్యవసాయ భూములలో అంటుకొని సబ్ స్టేషన్ ఆవరణలోకి చేరుకోవడం వల్ల మంటలు చెలరేగాయి. స్థానిక సర్పంచ్, అగ్నిమాపక శాఖ వారు సమయానికి చేరుకొని మంటలను ఆర్పడం ద్వారా రెండు కోట్ల రూపాయలు నష్టం కాకుండా కాపాడగలడం జరిగింది. ఈ సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గాడి పెల్లి మహేందర్, ఏడిఈ తిరుపతి, విద్యుత్ సిబ్బంది శ్రావణ్, పూర్ణాచారి, పోలీస్ కానిస్టేబుల్ రమేష్, వీరస్వామి, వినయ్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# బాలల సమగ్రాభివృద్ధికి కుటుంబ భాగస్వామ్యం కీలకం

### - వర్ధన్నపేటలో "6 పిల్లర్స్ అఫ్ నేచరింగ్ కేర్ " అవగాహన కార్యక్రమం.
### - పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి.

మే 29 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

వర్ధన్నపేట సెక్టార్ పరిధిలో బాలల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా "6 పిల్లర్స్ అఫ్ నచరింగ్ కేర్ (ఈసీ డి )" అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణీ స్త్రీలు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, తండ్రులు తాతమ్మలకు బాలల సంరక్షణ, పోషణ, ఆరోగ్యం, ప్రారంభ విద్య, భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బాలల జీవితంలో తొలి 1000 రోజుల ప్రాముఖ్యత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. తల్లిపాల అవసరం, పూరక ఆహారం ప్రారంభించే సరైన సమయం, బాలల ఎదుగుదల మైలురాళ్లు, అంగన్‌వాడీ టీచర్ల హోం విజిట్ల ప్రాధాన్యతపై వివరించారు. స్పందనాత్మక పెంపకం, తల్లిదండ్రులు--బాలల మధ్య పరస్పర చర్యలు, ప్రారంభ ఉద్దీపన వంటి అంశాలపై చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికంగా లభించే వస్తువులతో తక్కువ ఖర్చుతో ఆట వస్తువులు, అభ్యాస సాధనాలు తయారు చేసే విధానాలపై అవగాహన కల్పించి డి ఐ వై ఆట వస్తువుల తయారీకి ప్రోత్సాహం అందించారు. బాలల అభివృద్ధిలో తండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమని, సరైన పోషకాహారం, స్పందనాత్మక ఆహార పద్ధతులపై కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా సూచనలు చేశారు. పూరక ఆహారాన్ని సమయానికి ప్రారంభించడం, తల్లిపాలు ఇవ్వడం, బాలల పోషణలో బాలమృతం, బాలమృతం ప్లస్ వినియోగంపై ప్రదర్శనలు





నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పి. డెబోరా, మండల సూపర్వైజర్లు ఎ. లలిత, కె. చంద్రకళ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్, ఏఎన్‌ఎంలు అరుణ, అనిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, లబ్ధిదారులు, ప్రీ స్కూల్ పిల్లల తాతయ్యలు, నానమ్మలు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గడివేముల మండలం పెసరవాయి గ్రామంలో ఆపరేషన్ వజ్రపుహార్ కార్యక్రమం నిర్వహణ

## - జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్

నంద్యాల : నంద్యాల జిల్లా వ్యాప్తంగా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు మరియు మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆపరేషన్ వజ్రపుహార్ కార్యక్రమం నిర్వహించాలన్న జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్ ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం జావళి ఎస్పీ సూచనలతో గడివేముల సబ్ ఇన్స్పెక్టర్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో నేడు సమస్యాత్మక గ్రామమైన పెసరవాయి నందు తన సిబ్బందితో కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్" నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అనుమానితులు మరియు నేరచరిత్ర గల వారి ఇల్లు పరిసర ప్రాంతాలు తనిఖీ చేయడం జరిగింది. అనంతరం అదే గ్రామంలో ఉన్న ఫ్యాక్షన్ పికెట్ ను తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీలలో సరైన ధ్రువపత్రాలు లేని మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అనుమానిత బెల్ట్ షాప్ లు ఇళ్లను కూడా తనిఖీ చేయడం జరిగింది. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి మహిళలు మరియు పిల్లలపై నేరాలు, ఆస్తి నేరాలు, రహదారి భద్రత/ట్రాఫిక్ నియమ నిబంధనలు, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్ మోసాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, ఫ్యాక్షన్ మరియు రాజకీయ సంబంధిత సమస్యలు, శక్తి యాప్ యొక్క ప్రాముఖ్యత ప్రయోజనాలు, సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత మొదలైన అంశాలపై బహిరంగ సభలు నిర్వహించారు

# నంద్యాలలో ఘనంగా ప్రారంభమైన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్

నంద్యాల : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ "ఆపరేషన్ క్లీన్ స్వీప్" నంద్యాల పురపాలక సంఘం పరిధిలో ఘనంగా ప్రారంభమైంది. నంద్యాల పట్టణంలోని ప్రముఖ వ్యాపార కేంద్రమైన గాంధీ చౌక్ లో గల కూరగాయల మార్కెట్ పరిసరాలలో ఈ పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మంత్రిలు స్వయంగా చేతిలోకి చీపురు పట్టి, మార్కెట్ పరిసరాలను శుభ్రం చేయడం ద్వారా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థలలో యు ఎల్ బి నేటి (మే 23) నుండి జూన్ 20, 2026 వరకు నెల రోజుల పాటు ఈ "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. పట్టణాల్లోని అంతర్గత రహదారులు, మురుగు కాలువలు (డ్రైన్లు) మరియు ప్రజలు ఎక్కువగా తిరిగే మార్కెట్ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడమే ఈ వినూత్న కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. "శుభ్రమైన రోడ్లు – శుభ్రమైన డ్రైన్లు – స్వచ్ఛమైన పరిసరాలు" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా కదలాలని, నంద్యాల పట్టణాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు పురపాలక అధికారులు, సిబ్బంది, వ్యాపారస్తులు మరియు స్థానిక ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించి భాగస్వాములు కావాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంఈ గుర్రప్ప, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు స్థానిక కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ఇంధన పొదుపుకు జిల్లా అధికారుల సమిష్టి ప్రయాణం

### - "వన్ మంత్ - ఫోర్ విజిట్"లో బస్సుల వినియోగంతో వినూత్న సందేశం
### - ప్రజల్లో ఇంధన పొదుపుపై అవగాహన పెంపే లక్ష్యం :
### - కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల : ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా అమలు చేస్తూ జిల్లా అధికారులు సమిష్టిగా బస్సుల్లో ప్రయాణించడం ద్వారా వినూత్న సందేశాన్ని ప్రజలకు అందించారు. శనివారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, వివిధ శాఖల జిల్లా అధికారులు నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ ఆవరణ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి గారి సూచనల మేరకు ప్రతి ఒక్కరిలో ఇంధన పొదుపుపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు సందేశం ఇచ్చే ముందు అధికారులే ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా, డివిజనల్, నియోజకవర్గ మరియు మండల స్థాయి అధికారులు తమ తమ వ్యక్తిగత వాహనాలలో కాకుండా, సమిష్టిగా మూడు బస్సుల్లో ప్రయాణించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఇకపై "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమం కింద ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఇదే విధానాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంయుక్త తనిఖీలు, సమావేశాలు లేదా పర్యటనల సందర్భాల్లో పలువురు అధికారులు విడివిడిగా వాహనాలు వినియోగించకుండా ఒకే వాహనంలో ప్రయాణించడం ద్వారా ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ చర్యల ద్వారా ప్రజల్లో కూడా ఇంధన పొదుపుపై మరింత అవగాహన పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప అనవసర ప్రయాణాలను తగ్గించాలని, ముఖ్యంగా సెలవు దినాల్లో వాహనాల వినియోగాన్ని పరిమితం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకే ఇంధనాన్ని వినియోగిస్తూ వృథా ఖర్చులను తగ్గించుకునే దిశగా ముందుకు రావాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పెద్ద వంకే శ్మశానంగా మారిన వైనం

## రోల్లపాడు గ్రామం నందు స్మశాన వాటిక కోసం ఆర్డీవోకు వినతి పత్రం అందజేత

తుగ్గలి : తుగ్గలి మండల పరిధిలోని కడమకుంట్ల గ్రామ పంచాయితీ లోని రోల్లపాడు గ్రామంలో స్మశాన వాటిక లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో స్మశాన వాటికకు స్థలం లేకపోవడంతో చనిపోయిన వారికి పూడ్చి పెట్టడానికి చోటు లేక గ్రామం పక్కనగల పెద్దవంకలోనే అంత్యక్రియ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు రోల్లపాడు వెంకటేష్ పత్తికొండ ఆర్డిఓ ఓబులేసుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం ఏర్పడిన నాటి నుండి స్మశాన వాటిక లేకపోవడంతో, గ్రామస్తులు తప్పనిసరి పరిస్థితుల్లో ఊరికి ఆనుకొని ఉన్న పెద్ద వంకలోనే మృతదేహాలను పూడ్చిపెడుతున్నారు. అయితే ప్రతి వర్షాకాలం వచ్చే వరదలకు ఆ సమాధులు పూర్తిగా కొట్టుకుపోయి, ఆనవాళ్లు కూడా మిగలడం లేదని, చనిపోయిన మా వారి సమాధిపై పూలు వేద్దామన్నా స్థలం ఉండట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో దాదాపు 55 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయని, ప్రభుత్వానికి అర్జీల రూపంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేదని ఆయన తెలియజేశారు.

## వైద్య మంత్రి ఇలాకాలో

# ఉచిత వైద్య సేవలు

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే పనిలో ఉంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రుల్లో అవసరమైన యంత్రాలు, పరికరాలను ఏర్పాటు చేస్తోంది. వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సొంత నియోజకవర్గం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి 21 రకాల యంత్రాలు, పరికరాలు మంజూరయ్యాయి. మంత్రి చొరవ తీసుకోవడంతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు, శస్త్రచికిత్సలను పైసా ఖర్చు లేకుండా ఉచితంగా చేయించుకోవచ్చని చెబుతున్నారు అధికారులు. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఫుల్లీ ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ అనలైజర్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. రక్తం, మూత్రం శాంపిల్స్‌ను సేకరించి తక్కువ సమయంలోనే రిపోర్ట్ అందిస్తారు. అతి తక్కువ సమయంలో ఎక్కువ పరీక్షలు చేయొచ్చు. ఈ ఆస్పత్రిలో ప్రతిరోజూ 40 నుంచి 50 మందికి రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. ధర్మవరం ఆస్పత్రిలో చేసే 20 రకాల పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్‌లో చేయిస్తే రూ.2,500 నుంచి రూ.4 వేల వరకు ఖర్చవుతుంది. అదే ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సేవలు పూర్తిగా ఉచితం. అలాగే ఫోర్ ప్రోబ్ అల్ట్రా సోనోగ్రామ్ విత్ కలర్ డాప్లర్ యంత్రం కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. కిడ్నీలు, లివర్, గాల్ బ్లాడర్, పాంక్రియాస్ వంటి సమస్యల్ని గుర్తిస్తుంది. ఫ్యాటీ లివర్, కిడ్నీలో రాళ్లు, గాల్ బ్లాడర్‌లో రాళలు, అపెండిసైటిస్, గుండెకు సంబంధించిన సమస్యల్ని తెలుసుకోవచ్చు. ఈ యంత్రం ద్వారా మహిళలకు గర్భసంచికి సంబందించిన సమస్యలు, గర్భిణుల్లో బిడ్డ గుండె పనితీరును తెలుసుకోవచ్చంటున్నారు. డబుల్ పంచ్ ల్యాప్రోస్కోపీ మెషిన్ కూడా అందుబాటులోకి వచ్చింది. సాధారణ శస్త్రచికిత్సలు, అపెండిక్స్ తొలగింపు, హెర్నియాను బాగు చేయడం, పిత్తాశయంలో రాళ్లు తొలగించవచ్చంటున్నారు. ఆయా ఆపరేషన్లు బయటకు చేయించుకోవాలంటే రూ.30వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుంది.. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రం పూర్తిగా ఉచితంగానే ఆపరేషన్లు చేస్తున్నారు. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చిన కొత్త యంత్రాలు, వైద్య పరికరాలు ప్రజలకు అందబాటులోకి వచ్చాయన్నారు సూపరిండెంటెంట్ వైద్య సేవల్ని 24 గంటలు అందిస్తున్నామని.. ఆపరేషన్లు చేస్తున్నామన్నారు.

పుట్టపర్తికి వరుస వరాలు

మరోవైపు శ్రీసత్యసాయి జిల్లాకు ప్రభుత్వం వరుసగా శుభవార్తలు వినిపిస్తోంది, సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో డీఆర్‌డీవో ఫిఫ్త్ జనరేషన్ స్టెల్త్ యుద్ధ విమాన తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా మే 15న ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనున్నట్లు సమాచారం. ఈ ప్లాంట్‌లో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు తయారు చేస్తారు. ఈ ప్లాంట్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఆర్‌డీవోకు 600 ఎకరాల భూమిని కేటాయించింది. మరో 400 ఎకరాలను త్వరలోనే కేటాయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2029 నాటికి ఈ ప్లాంట్ ప్రారంభించాలనే ఉద్దేశంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మరోవైపు శ్రీసత్యసాయి జిల్లాను ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ హబ్‌గా అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పాలసముద్రం వద్ద భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ రూ.500 కోట్లతో డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. మడకశిరలో కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ డిఫెన్స్ ఎనర్జిటిక్స్ తయారీ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఇప్పుడేమో శ్రీసత్యసాయి జిల్లాలో రూ.51 వేలకోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఏపీ స్టేట్ ఇన్‌వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ఆమోదం తెలిపింది. మంత్రివర్గం ఆమోదం అనంతరం ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది.

# షర్మిళకు రాజ్యసభ..

కడప : దేశవ్యాప్తంగా రాజ్యసభ ఎన్నికల సందడి కనిపిస్తోంది. పది రాష్ట్రాల నుంచి 24 మంది ఎంపీలు పదవీ విరమణ చేస్తున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపికకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ నుంచి నలుగురు సభ్యులు పదవీ విరమణ చేయనుండగా.. ఆ పదవులన్నీ కూటమి ఖాతాలోనే పడనున్నాయి. మరోవైపు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలకు సైతం రాజ్యసభ పదవి ఖాయమని ప్రచారం నడుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని కాంగ్రెస్ వైపునకు తిప్పేందుకు షర్మిల కు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. ప్రధానంగా ఆమెను కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎంపిక చేస్తారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతానికి ఆమెకు సానుకూలమైన వాతావరణం ఉన్నట్లు తెలుస్తోంది. కర్ణాటక నుంచి ముగ్గురు సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ఆ మూడు పదవులు కాంగ్రెస్ పార్టీకి దక్కనున్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సైతం పదవీ విరమణ చేయను న్నారు. అయితే కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి కోసం ఆశిస్తున్నారు. అయితే సిద్ధరామయ్య వర్గం దానిని అడ్డుకుంటోంది. మధ్యేమార్గంగా మల్లికార్జున్ ఖర్గేకు ముఖ్యమంత్రి పదవి అప్పగించి.. రాజ్యసభకు సిద్ధరామయ్యకు పంపిస్తారని తెలుస్తోంది. మరో రెండు రాజ్యసభ పదవుల్లో ఒకటి షర్మిల కు ఖాయం చేసినట్లు పొలిటికల్ వర్గాల్లో నడుస్తోంది. అటు డీకే శివకుమార్ వర్గం సైతం షర్మిలకు మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. తన తండ్రి పేరుతో తెలంగాణలో పార్టీని ఏర్పాటు చేశారు షర్మిల. కానీ పెద్దగా వర్కౌట్ కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. విలీన సమయంలోనే షర్మిలకు గట్టి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ తరుపున రాజ్యసభ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని సమాచారం. ఇప్పుడు దాని ప్రకారం కర్ణాటక నుంచి షర్మిలను ప్రమోట్ చేస్తారని తెలుస్తోంది. ఈ విషయంలో రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. షర్మిలకు రాజ్యసభ పదవి ఇవ్వడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో వైయస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులను మరింతగా ఆకర్షించవచ్చన్నది కాంగ్రెస్ ఆలోచన. వచ్చే ఎన్నికల నాటికి ఏపీలో సైతం ఓట్ల పరంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలంటే.. షర్మిల నాయకత్వాన్ని మరింత పెంచాలని ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

# విశాఖపట్నం డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్

విశాఖపట్టణం : విశాఖపట్నంలో డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్‌కు సంబంధించి కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ కేంద్రానికి కీలక ప్రతిపాదన చేసింది. విశాఖపట్నంలో డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్ 20 కిలోమీటర్లు కాకుండా 13 కిలోమీటర్లు సరిపోతుందని కేంద్రానికి తెలిపింది. వాస్తవానికి ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ 20 కిలోమీటర్లకు ప్రతిపాదనలు పంపింది.. కానీ 13 కిలోమీటర్లు సరిపోతుందని రైట్స్ చెబుతోంది. విశాఖపట్నం డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్‌కు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రం దగ్గర ఉన్నాయి. మొత్తం 20 కిలోమీటర్లు మేరు డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్‌ను ప్రతిపాదించగా.. ఈ అంశంపై సర్వే చేసిన రైట్స్ కన్సల్టెన్సీ మాత్రం 13 కిలోమీటర్లు చాలని కేంద్రానికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. డబుల్ డెక్కర్ మెట్రో కారిడార్ గాజువాక నుంచి హనుమంతవాక వరకు సరిపోతుందని కేంద్రానికి రైట్స్ కన్సల్టెన్సీ సూచించినట్లు సమాచారం. విశాఖపట్నంలో ఏకంగా 140.13 కిలోమీటర్లు మెట్రో రైల్ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ముందుగా మొదటి దశలో 46.23 కిలోమీటర్ల పొడవున రూ.11,498 కోట్లతో ఈ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు చేశారు. ఇంతలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నగరం మధ్యలోని నేషనల్ హైవే దగ్గర ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫ్లై ఓవర్ నిర్మిస్తామని తెలిపింది. లంకెలపాలెం నుంచి మధురవాడ వరకు ప్లాన్ చేశారు. ఈ క్రమంలో మెట్రో రైలు ప్రాజెక్టులో డబుల్ డెక్కర్ కారిడార్ ప్రతిపాదన వచ్చింది. ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ 20 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ మెట్రో డబుల్ డెక్కర్ కారిడార్‌ను స్టీల్‌ప్లాంట్ నుంచి గాజువాక వరకు 5 కిలోమీటర్లు.. తాటిచెట్లపాలెం నుంచి మధురవాడ వరకు 15 కిలోమీటర్లు ప్లాన్ చేశారు. నేషనల్ హైవే మధ్యలో మెట్రో కారిడార్ స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు నిర్మించాలని భావించారు. ఈ ప్రతిపాదనతో భూసేకరణ అవసరం ఉండదని ఇలా డిజైన్ చేశారు.

అలాగే మెట్రో ప్రాజెక్టు వ్యయం కూడా తగ్గుతుందన్నది భావించారు. మెట్రో కారిడార్ ఎన్‌హెచ్‌ఏఐ నిర్మిస్తామన్న ఫ్లైఓవర్‌పై వచ్చేలా డిజైన్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ కేంద్రానికి ఈ ప్రతిపాదనలకు సంబంధించిన డీపీఆర్‌ను పంపింది. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగాయి.. ఈ క్రమంలో నగర ప్రజలు మెట్రో రైల్ వస్తే బావుంటుందని ఎదురు చూస్తున్నారు. ఇంతలో డబుల్ డెక్కర్ ప్రతిపాదనల్ని కుదించాలని రైట్స్ సంస్థ కేంద్రానికి సిఫార్సు చేయడం చర్చనీయాంశమైంది. 20 కిలో మీటర్లకు ప్రతిపాదిస్తే 13 కిలోమీటర్లకు కుదించడం దారుణమన్నారు.

# ఏకగ్రీవాలను అడ్డుకోండి

గుంటూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో సరికొత్త పాచిక వేశారు. ఎక్కడ ఏకగ్రీవాలు అనే మాట లేకుండా చూడాలని చూస్తున్నారు. పొరపాటున ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిలపై వేటు వేస్తానని హెచ్చరించారు. తద్వారా ఎక్కడ పార్టీ నేతలు తప్పించుకోకుండా ఉండేందుకు ముందుగానే వారిని కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. ప్రజలు కూడా ఎక్కువగా ఏకగ్రీవాలకు మొగ్గు చూపుతారు. ఎందుకంటే స్థానికంగా రాజకీయ అంశాలు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. గ్రామ పెద్దల ప్రమేయంతో చాలాచోట్ల ఏకగ్రీవాల వైపే చూస్తారు. ముఖ్యంగా పంచాయతీలకు ఏకగ్రీవాలు అనేవి సర్వసాధారణం. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ఏకగ్రీవం అన్న మాట వినిపించకూడదు అంటూ సొంత పార్టీ నేతలను హెచ్చరించడం బ్లాక్మెయిలింగ్ కిందకి వస్తుంది. 2021లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలం మొత్తానికి ఒకే పదవిగా ఉండే జడ్పిటిసిలను సైతం ఏకగ్రీవం చేసుకున్నారు. పంచాయితీల గురించి చెప్పనవసరం లేదు. ఇక ఎంపీటీసీల గురించి చెప్పనవసరం లేదు. అన్ని ఏకగ్రీవాలే. ఎందుకంటే అధికార పార్టీగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలను నిరసిస్తూ ప్రాదేశిక ఎన్నికలను బహిష్కరించారు చంద్రబాబు. అప్పట్లో అంతలా ఉండేది ఏకగ్రీవాల పర్వం. ఒక అధికారాన్ని చేపట్టిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వెళ్లాక ఏకగ్రీవాలు వద్దు అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ రీతిలో ఏకగ్రీవాలను చేసుకుందో జగన్మోహన్ రెడ్డికి తెలియంది కాదు. అయితే ఆయన తెలివిగా ఇప్పుడు ఆ బాధ్యతను నియోజకవర్గం అప్పగించారు. అంటే తప్పకుండా పోటీ ఉంటే పార్టీ ఓటు బ్యాంకు ఎటు వెళ్లదన్నది జగన్మోహన్ రెడ్డి ఆలోచన. అయితే దీనిని ఎక్కువ మంది వైసీపీ నేతలు తప్పుపడుతున్నారు.



గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఇదే మనిషి ఏకగ్రీవాలు చేయమన్నారు. ఇప్పుడు ఏకగ్రీవాలు అంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఇది ఎక్కడి చోద్యం అని ఆవేదన వ్యక్తం చేస్తున్న వారు ఉన్నారు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జిలతో సమావేశం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. అధికార పార్టీ మహానాడు నిర్వహిస్తున్న దృష్ట్యా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడిపోతుందన్న వార్త ఉంది. అదే అజెండాతో ఈరోజు సమావేశం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి.. స్థానిక సంస్థల నిర్వహణ బాధ్యతను నియోజకవర్గ ఇన్చార్జిలే తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే వచ్చే ఎన్నికల్లో టికెట్ వస్తుందో లేదో? తమకే వస్తుందో లేదో? అనే ఆలోచనలో ఉన్నారు కొందరు ఇన్చార్జిలు. కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్లాంటివారు అయితే అసలు యాక్టివ్ కాలేదు. అటువంటి వారికి ఎటువంటి ఆదేశాలు ఇవ్వకుండా.. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలకు తమను కమిట్మెంట్ చేయడం పై ఆగ్రహంగా ఉన్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు

# కొత్త విమానాశ్రయాలకు రెడీ

కాకినాడ : ఏపీలో కొత్తగా ఎయిర్‌పోర్ట్‌లకు సంబంధించి ప్రతిపాదనలు వచ్చిన సంగతి తెలిసిందే. కాకినాడ జిల్లాలో కూడా కొత్తగా ఎయిర్‌పోర్ట్‌ను ప్లాన్ చేయగా.. తుని-అన్నవరం మధ్య విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదించారు. తాజాగా విమానాశ్రయం సాధ్యతపై ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నివేదిక కోరింది. దీంతో కాకినాడ జిల్లా అధికారులు త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎయిర్‌పోర్ట్ అంశంపై సమగ్ర సమాచారంతో ఓ నివేదికను సిద్ధం చేసి పంపించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా ఏడు ఎయిర్‌పోర్ట్‌లను ప్లాన్ చేసింది. ఇప్పటికే ప్రతిపాదనల్ని కేంద్రానికి పంపించగా.. ప్రస్తుతం కసరత్తు జరుగుతోంది. ఈ ఏడు విమానాశ్రయాల్లో కాకినాడ జిల్లాలో ప్లాన్ చేసిన ఎయిర్‌పోర్ట్ భూముల కేటాయింపునకు సంబంధించి కాస్త గందరగోళం ఏర్పడింది. తుని-అన్నవరం మధ్య ఏర్పాటు చేయాలని భావించారు.. ఆ తర్వాత పాయకరావుపేట తుని మధ్యలో అంటూ ప్రచారం జరిగింది. అయితే మళ్లీ తుని-అన్నవరం మధ్య ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తాజాగా ఈ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి అప్డేట్ వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కీలక ఆదేశాలు ఇచ్చింది. తుని-అన్నవరం మధ్య విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని కాకినాడ జిల్లా కలెక్టర్, అధికారుల్ని కోరింది. భూసేకరణకు సంబంధించి వివరాలు అడిగారు. ప్రభుత్వ భూముల లభ్యత, ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదించిన చోటి నుంచి రోడ్డు ఎంత దూరంలో ఉంది. నీళ్లు, విద్యుత్ సహా మిగిలిన సౌకర్యాలు ఉన్నాయా.. భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, రికార్డులు వంటి అంశాలపై నివేదిక కోరారు. ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా అధికారులు త్వరలోనే రంగంలోకి దిగి వివరాలు సేకరించి నివేదికను అందించనున్నారు. కాకినాడ జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదన వచ్చిన సమయంలో తుని-అన్నవరం మధ్య తొండంగి మండలం బెండపూడి, పీ ఈ చిన్నాయిపాలెం మధ్య ప్లాన్ చేశారు. కొత్త విమానాశ్రయానికి అవసరమైన భూమిని కూడా గుర్తించారు. అలాగే అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రాథమికంగా ఓ నివేదికను అందజేశారు. కోల్‌తా-చెన్నై నేషనల్ హైవే 16కు ఆనుకుని, అన్నవరం రైల్వేస్టేషన్‌కు మూడు కిలోమీటర్ల సమీపంలో స్థలాన్ని గుర్తించారు. 2024లో అప్పటి కాకినాడ జిల్లా కలెక్టర్ పీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నివేదికను అందజేశారు.. ఆ తర్వాత మళ్లీ ఈ కొత్త ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనలపై క్లారిటీ రాలేదు.. తాజాగా మరోసారి వివరాలు కోరారు. ఈ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. ఎయిర్ కార్గో ద్వారా కాకినాడ పోర్టు నుంచి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న కంపెనీల నుంచి ఎగుమతులు చేయొచ్చంటున్నారు.

# టీడీపీకి గేమ్ ఛేంజర్ కానున్న మహిళా రిజర్వేషన్

విజయవాడ : టీడీపీ చరిత్రాత్మక ప్రకటన చేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లుతో సంబంధం లేకుండానే.. మహిళలకు 33 శాతం సీట్లు ఇవ్వబోతున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు మహానాడులో తీర్మానం చేశారు. ఈ ఒక్క ప్రకటన.. ఏపీ రాజకీయాన్ని ఎలా మార్చబోతోంది. విపక్షాలకు ఒక రకంగా ఇది టీడీపీ విసిరిన సవాల్ అనుకోవచ్చా.. ఇప్పుడు వైసీపీ స్టాండ్ ఎలా ఉండే అవకాశం ఉంది..మహానాడు మొదటిరోజే చరిత్రలో నిలిచే పోయే సంఘటన కనిపించింది. గతానికి భిన్నంగా హైబ్రిడ్ మోడల్‌లో మహానాడు నిర్వహిస్తున్న టీడీపీ.. పూర్తిగా డిజిటల్ వేదికపై మీటింగ్స్ నిర్వహిస్తోంది. స్త్రీశక్తి అనే థీమ్‌తో ఈసారి మహానాడు నిర్వహిస్తున్న టీడీపీ.. మహిళా సాధికారత, యువత పాత్ర, సామాజిక సమతుల్యత లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ కార్యక్రమాలను రూపొందించింది. ఐతే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహానాడు వేదిక నుంచి నారా లోకేష్.. భారీ అనౌన్స్‌మెంట్ చేశారు. మహిళల కోసం టీడీపీ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని మహానాడు వేదికపై నుంచి ప్రకటించారు. మహిళా రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా.. భవిష్యత్‌లో అన్ని ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు రిజర్వ్ చేయాలని టీడీపీ నిర్ణయించింది. ఇదే ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్ అవుతోంది. ఎన్నికల టైమ్‌లో చాలా పార్టీలు మహిళా సాధికారత గురించి మాట్లాడతాయని.. ఐతే ఎలక్షన్స్ తర్వాత మహిళలను మర్చిపోతాయని.. టీడీపీ విధానం.. నినాదం రెండూ మహిళల అభ్యున్నతే అన్నారు లోకేశ్. మహిళల విషయంలో గతంలో టీడీపీ చారిత్రక నిర్ణయాలు తీసుకుంది. ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కు కల్పిస్తే.. చంద్రబాబు సీఎంగా విద్యా సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇప్పుడు పార్టీ అభ్యర్థుల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించడంతో టీడీపీ మరో ముందడుగు వేసింది. టీడీపీ నిర్ణయం అమల్లోకి వస్తే.. పొలిటికల్‌గా గేమ్‌ఛేంజర్‌గా మారే అవకాశాలు క్లియర్‌గా కనిపిస్తున్నాయ్. నెక్స్ట్ ఎన్నికల్లో సైకిల్ పార్టీకి అతి పెద్ద ఆయుధంగా మారే అవకాశం ఉంటుంది. ఐతే అటు టీడీపీ ఒక్క స్టేట్‌మెంట్‌తో.. విపక్షాలకు సవాల్ విసిరినట్లు కూడా అయింది. ఇది రాజకీయాన్ని మలుపు తిప్పే అవకాశాలు లేకపోలేదనే చర్చ జరుగుతోంది. రిజర్వేషన్ బిల్లుతో సంబంధం లేకుండా.. మహిళలకు 33శాతం సీట్లు ఇస్తే మాత్రం.. దేశ రాజకీయాల్లోనే టీడీపీ ప్రత్యేక స్థానంలో ఉంటుంది. ప్రకటనల సంగతి ఎలా ఉన్నా.. జాతీయ స్థాయిలో ఏ పార్టీ కూడా మహిళలకు కచ్చితంగా 33శాతం టికెట్లు ఇవ్వడం లేదు. చాలా పార్టీలు 10 నుంచి 18శాతం మాత్రమే ఇస్తున్నాయ్. ఇదంతా ఎలా ఉన్నా.. ఇప్పుడు టీడీపీ చేసిన ప్రకటన వైసీపీని టార్గెట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయ్. మహిళలకు సీట్ల కేటాయింపు విషయంలో ఆ పార్టీలు ఇదే దారిలో ప్రయాణించాల్సి ఉంటుంది. వాళ్లు కూడా 33శాతం సీట్ల కేటాయింపునకు ఫిక్స్ కావాల్సి ఉంటుంది. . చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు కల్పించే వీలుగా ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. మూడింట రెండు వంతు మెజారిటీ లేక వీగిపోయింది ఈ బిల్లు. అయితే ఈ బిల్లు ఇప్పుడు మరోసారి పార్లమెంట్లో ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేష్ ఈ మహిళా బిల్లు పై గట్టిగానే మాట్లాడుతున్నారు. జాతీయస్థాయిలో మిగతా రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ తరుణంలో మహానాడు వేదికగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై సంచలన నిర్ణయం తీసుకుంది తెలుగుదేశం పార్టీ. బిల్లు ఆమోదంతో సంబంధం లేకుండా 2029 ఎన్నికల్లో 33 శాతం మహిళలకు టిక్కెట్లు ఇస్తామని ప్రకటించింది తెలుగుదేశం. స్త్రీ శక్తి థీమ్ తో సాగిన మహానాడు లో అదే మహిళలకు సంబంధించి కీలక ప్రకటన చేశారు నారా లోకేష్. పార్లమెంటులో బిల్లుతో సంబంధం లేకుండా 2029 ఎన్నికల్లో 33% మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారు. అంటే వచ్చే ఎన్నికల్లో దాదాపు 50 మంది మహిళా ఎమ్మెల్యేలు సభకు రానున్నారు అన్నమాట. ఇప్పటికే నాయకులు తమ మహిళా వారసులను రంగంలోకి దించారు. పార్టీతో పాటు పాలనలో భాగస్వామ్యం కల్పిస్తున్నారు. ఇప్పుడు మహానాడు వేదికగా యువరాజు లోకేష్ ప్రకటనతో సీనియర్ నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మహానాడు వేదికపై పెద్ద చర్చ నడిచింది. అయితే చాలామంది నేతలు కుమార్తెలు లేకపోవడంతో కోడళ్లను రంగంలోకి దించేందుకు అక్కడి నుంచే ప్రణాళిక మొదలు పెట్టారు. మొత్తానికైతే మహానాడు వేదికగా తొలి రోజు ఒక సంచలన నిర్ణయం వెలువడటం నిజంగా గొప్ప విషయమే.

# భారంగా మారుతున్న పోలవరం పునరావాసం

ఏలూరు : ఆంధ్రప్రదేశ్లో నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి అత్యంత కీలకమైన జల ప్రాజెక్టులలో ఒకటిగా భావిస్తున్నారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి అవసరాలను తీర్చే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. అయితే ప్రాజెక్టు నిర్మాణం ఎంత ముఖ్యమో, దాని ప్రభావిత ప్రాంతాల్లో పునరావాసం అంతకంటే పెద్ద సవాలుగా మారుతోంది. పోలవరం ప్రాజెక్టు కారణంగా అనేక గ్రామాలు ముంపు ప్రాంతాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలు తమ ఇళ్లు, భూములు కోల్పోయే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తరతరాలుగా నివసిస్తున్న ప్రాంతాలను విడిచి వెళ్లాల్సి రావడంతో బాధిత కుటుంబాల్లో ఆందోళన పెరుగుతోంది. తమ జీవన విధానం పూర్తిగా మారిపోతుందనే భయం కూడా వారిలో కనిపిస్తోంది ప్రభుత్వం పరిహారం, ఇళ్ల స్థలాలు, పునరావాస కాలనీలు కల్పిస్తున్నప్పటికీ అనేక మంది ఇంకా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూముల విలువకు సరిపడా పరిహారం అందడం లేదని కొందరు చెబుతుంటే, కొత్త ప్రాంతాల్లో మౌలిక వసతులు సరిగా లేవని మరికొందరు అంటున్నారు. తాగునీరు, రహదారులు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వ్యవసాయం మీద ఆధారపడే కుటుంబాలకు పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. పంట భూములు కోల్పోవడంతో జీవనోపాధి దెబ్బతింటోంది. కొత్త ప్రాంతాల్లో తిరిగి వ్యవసాయం ప్రారంభించడం అంత సులభం కాకపోవడంతో కొందరు ఇతర ఉపాధి మార్గాలను వెతుక్కోవాల్సి వస్తోంది. దీంతో ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని బాధితులు చెబుతున్నారు. పోలవరం వంటి భారీ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి అవసరమే అయినప్పటికీ, ప్రభావిత కుటుంబాల భవిష్యత్తును కూడా సమానంగా దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేవలం డబ్బు చెల్లించడం కాకుండా, స్థిరమైన జీవనోపాధి కల్పించడం ముఖ్యమని సూచిస్తున్నారు. అలాగే ప్రాజెక్టు ప్రాంత ప్రజలతో నిరంతరం చర్చలు జరపడం అవసరమని సామాజిక వర్గాలు చెబుతున్నాయి. వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కారాలు చూపితే వ్యతిరేకత తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అధికారులు, ప్రజల మధ్య సమన్వయం లేకపోతే వివాదాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం అవుతున్న నేపథ్యంలో పునరావాస అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాష్ట్రానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు ప్రభావిత ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతినకుండా చూడటం కూడా అంతే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఇలాంటి భారీ ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో విజయవంతమవుతాయని చెబుతున్నారు.

# పచ్చిరొట్ట ఎరువులకు ప్రాధాన్యం

## - రాయపోల్ మండలంలో జనుము విత్తనాల పంపిణీ.

సిద్దిపేట ప్రజాకలం మే 29.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని ఆగ్రోస్-1, ఆగ్రోస్-2 కేంద్రాలలో పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించే జనుము, జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి



దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య, రాయపోల్ సర్పంచ్ మాసంపల్లి రాజు ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూముల భూసారం కాపాడేందుకు పచ్చిరొట్ట ఎరువుల వినియోగం ఎంతో అవసరమని తెలిపారు. జనుము వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి భూమిలో కలపడం ద్వారా నేలలో సేంద్రీయ పదార్థాలు పెరిగి భూమి సారవంతత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. దీంతో పంటలకు అధిక దిగుబడులు రావడంతో పాటు రసాయన ఎరువుల వినియోగం తగ్గి రైతుల పెట్టుబడి భారం కూడా తగ్గుతుందన్నారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు భూమిలో తేమ నిల్వ ఉండేందుకు, సూక్ష్మ పోషకాల పెరుగుదలకు దోహదపడతాయని తెలిపారు. ముఖ్యంగా వరి, పత్తి తదితర పంటల సాగులో జనుము పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా దిగుబడులు మెరుగుపడటంతో పాటు భూమి దీర్ఘకాలిక సారవంతత పెరుగుతుందని వివరించారు. రైతులు ప్రతి సీజన్‌లో కొంతభాగంలో అయినా పచ్చిరొట్ట ఎరువుల సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో నరేష్, మాజీ నీటి సంఘం చైర్మన్ సత్తుగారి కిష్టారెడ్డి, యూత్ నాయకులు నర్సింగరావు, మహేష్ యాదవ్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నిర్వాహకులు కాసుల అంజిరెడ్డి, భాగన్నగారి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు, పార్టీ లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: మే 29: ప్రజాకలం ప్రతినిధి

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తుర్కపల్లి డివిజన్‌కు చెందిన భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులతో బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకు మరింత బలోపేతం అవుతోందని అన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, ప్రాధాన్యత ఉంటాయని హామీ ఇచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పుట్నాల కృష్ణ, శోభన్ బాబు, మహేశ్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.











# ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

**కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి**

మహేశ్వరం, మే 29, (ప్రజా కలం)

ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి. కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి( కె.ఎల్.ఆర్ )ని వారి క్యాంప్ ఆఫీసు నందు కలవడం జరిగింది. గతంలో మేము కేఎల్ఆర్ ను కలిసినప్పుడు బాలాపూర్ మండల ( సిపిఐ ) పార్టీకి ఇల్లు లేని నిరుపేదలు ఉంటే వారికి తప్పనిసరిగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని కె ఎల్ ఆర్ మాతో చెప్పడం జరిగింది. కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తున్న ఇల్లు లేని నిరుపేదకు ఇండ్లు ఇవ్వమని వారి పేర్లు లిస్ట్ తీసుకొని ని ఈరోజు వారి క్యాంప్ ఆఫీసులో కలిసి లిస్ట్ ఇవ్వడం జరిగింది. తప్పనిసరిగా వారికి ఉండు నెలలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని మాట ఇవ్వడం జరిగిందని అందుకు వారికి సిపిఐ బాలాపూర్ పార్టీ తరపున బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా ఎన్నికైన కేరగారి శ్రీధర్ కి సన్మానించిన టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి

మహేశ్వరం, మే 29,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ డివిజన్ క్యారగారి శ్రీధర్



రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన శుభ సందర్భంగా శాలువాతో టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి సత్కరించి వారికి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ జెండా గద్దెల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి

## మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్‌కు దరఖాస్తు అందజేత

గజ్వేల్:29 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

టీఆర్ఎస్ పార్టీ పటిష్ఠతలో భాగంగా గజ్వేల్ మున్సిపల్ పరిధిలో పార్టీ జెండా గద్దెల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం పార్టీ జెండా పండుగ జిల్లా ఇంచార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్‌కు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ఇందిరా పార్కు చౌరస్తా,కోట మైసమ్మ ఆలయం, ప్రజ్ఞాపూర్ చౌరస్తా, ఆర్ అండ్ ఆర్ నిర్వాసిత కాలనీలో టీఆర్ఎస్ పార్టీ జెండా గద్దెల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గజ్వేల్ మున్సిపల్ పరిధిలో పర్యటించనున్న నేపథ్యంలో జెండా పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జెండా పండుగ రాష్ట్ర పరిశీలకుడు లోక రవిచంద్ర,నాయకులు ఇంద్రాగౌడ్, నరేందర్ రెడ్డి, ఎడ్ల నర్సింలు, శ్రీకాంత్, ప్రసాద్, చందు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాలకు గురించి బిఆర్ఎస్ నాయకులు ప్రజలను అడిగి తెలుసుకోవాలి

- గత ప్రభుత్వం ఒక రేషన్ కార్డ్ అయినా ఇచ్చిందా
- కనీసం రేషన్ కార్డుల పేరు మార్పు అయినా చేసిందా...
- దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా...
- కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డు సన్న బియ్యం
- ఉచిత కరెంటు ఇందిరమ్మ ఇల్లు ఉచిత బస్సు
- ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- ఎవరి ప్రభుత్వం హాయంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయో చర్చకు సిద్ధమా
- కాంగ్రెస్ పార్టీ నాయకుడు గద్దగూటి మహేందర్ ముదిరాజ్



మహేశ్వరం మే 29,(ప్రజా కలం)

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గద్దగూటి మహేందర్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి హామీల నెరవేర్చలేకపోయిందని అందుకే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించారని ఆయన అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రజలకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఉచిత గ్యాస్, పేదోటి సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, రేషన్ కార్డులో పేరు మార్పు, వృద్ధాప్య పింఛన్లు, వితంతువు పెన్షన్, రైతులకు రుణమాఫీ ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని అన్నారు. గత ప్రభుత్వం పేదలను నమ్మించి మోసం చేసిందని దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని మోసం చేయలేదని ఆయన ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసినందుకే టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపించారని ఆయన గుర్తు చేశారు. కానీ ఇప్పుడు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సంక్షేమ పథకాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. మహేశ్వరంలో ఏ కాలనీలోనైనా ప్రజలకు సంక్షేమ పథకాల వస్తున్నాయో లేవో తెలుసుకోవాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ కోసం నిరుద్ర కృషి చేస్తుందని ప్రజా సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తుందని ఆయన అన్నారు. బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణ వాస్తవం లేదని ప్రజలే ప్రభుత్వానికి అండగా ఉన్నారని వారికి సంక్షేమ పథకాల గురించి తెలియకపోతే ప్రజలను అడిగి తెలుసుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రజలకు తెలియాలని డబ్బు చప్పుడు ద్వారా తెలియజేస్తూ ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వస్తున్నాయని తెలుసుకొని మరి సంక్షేమ పథకాలు అందిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలుసుకోవాలని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఆయన అన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి గాంధీజీని తక్కువ చేసి మాట్లాడడం సబబు కాదు - ఎన్ సీ సంతోష్

గజ్వేల్:29మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)



సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో బిఆర్ఎస్ యువ నాయకుడు ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా యువజన అధ్యక్షులు ఎన్ సి సంతోష్ మాట్లాడుతూ హైదరాబాద్ లో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన విధానం మహాత్మా గాంధీని తక్కువ చేసే విదంగా ఉండడం బాధాకరం అని భారత రాజ్యాంగంలో గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవడం జరిగిందని అదే రాజ్యాంగం ద్వారా ముఖ్యమంత్రి హోదాను అనుభవిస్తున్న రేవంత్ రెడ్డికి ఇది సబబు కాదని ఇది ఆయన అజ్ఞానానికి అహంకారానికి నిదర్శమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందికి స్ఫూర్తిదాతగా నిలిచిన మహాత్ముడిపై సీఎం చూపిన నిబద్ధత అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు,అసలు హైదరాబాద్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి గాంధీ భవన్ పేరు ఎలా వచ్చిందో రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు తెలియజేయాలనీ, రేవంత్ తీరు చూస్తే త్వరలో గాంధీ భవన్ ని (సిబిఎన్)భవన్ గా మార్చే ప్రయత్నం చేస్తున్నాడని అనుమానం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గాంధీజీ ఆశయాలను తుంగలో తొక్కి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు స్వతంత్ర పోరాటంలో గాంధీజీ పాత్ర తక్కువ చేసే హక్కు ఎవరికీ లేదన్నారు పదవి ఇచ్చి కూర్చోబెట్టిన కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు,రాష్ట్ర వ్యాప్తంగా గాంధీయ వాదులు రేవంత్ రెడ్డి విధానాన్ని కండించాలని కోరారు.

# ఉద్యమకారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

- ఉద్యమకారుల వేదిక డిమాండ్
- జూన్ 2న సిద్దిపేటలో నిర్వహించే ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలి
- ఉద్యమకారుల వేదిక జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు పెద్ది రాజు
- గజ్వేల్ లో ఉద్యమకారుల వేదిక స్టీరింగ్ కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు



గజ్వేల్ :29 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

ఉద్యమ కారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు పెద్దిరాజు అన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో ప్రెస్ల క్లబ్ లో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో వివిధ ప్రజా, ఉపాధ్యాయ సంఘాలు,నబ్బండ వర్గాలు,యువత మహిళలు పాల్గొన్నారని వివరించారు. ఎందరో బలిదానాల వల్ల తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు.

వారి త్యాగ ఫలమే నేడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఉద్యమకారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని చెప్పారు. జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ మహోత్సవ కార్యక్రమంలో ఉద్యమకారులు,యువత,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కొరారు. సిద్దిపేటలో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు చేరుకొని కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల ప్రతి ఒకరు కట్టుబడి ఉండాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారుల ఎంపిక కోసం పలు తిర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు డి. కృష్ణ,పులి రాజు,సత్తయ్య, కళ్యాణ్ కార్ నర్సింగ్ రావు,గౌన్,ఎల్లయ్య,మాదాను శ్రీనివాన్,దేవి రవీందర్,రామకృష్ణారెడ్డి రాజేశం,జైపాల్ రెడ్డి,తుమ్మ కృష్ణ, యాదగిరి,రాజయ్య,మల్లేశం, పాల్గొన్నారు.

# రావిరాల గ్రామంలో కోళ్లు మేకల చోరీ

**ఆదిభట్ల పిఎస్ లో ఫిర్యాదు చేసిన బాధితులు**

మహేశ్వరం, మే 29, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామంలో కోళ్లు మేకలు చోరీ అవుతున్నాయని బాధితులు ఆదిభట్ల పిఎస్ లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో దాదాపు 60 కోళ్లు , ఒక మేక చోరి గురైనట్లు బాధితులు తెలిపారు. ఇలాగే ఉంటే ఇంకా చాలా దొంగతనాలు జరుగుతాయని వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని విచారణ చేసి నిందితులను పట్టుకోవాలని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఎవరు ఇలా చేస్తున్నారో తెలుసుకోవాలని పోలీసులను కోరారు. గ్రామంలో మేకలు కోళ్లు కాకుండా ఇంకేమైనా దొంగతనాలు జరుగుతున్నాయా అని పోలీసులు ఆరా తీశారు. ప్రజలు అప్రమత్తంగా జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. దొంగలు పట్టుకోవడానికి పోలీసులు నిఘా పెంచుతామని తెలిపారు.

# ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి.

**- ఈసీఐ మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.**

సంగారెడ్డి, ప్రతినిధి మే 29 ( ప్రజా కలం):

ఓటరు జాబితాను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా రూపొందించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్ఓ సూపర్వైజర్లకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణ, ఎన్యూమరేషన్ ఫారాల




పంపిణీ, ఓటర్ల ధృవీకరణ, ఇంటింటి పరిశీలన తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ, అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సీఈఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు అందజేసిన అనంతరం సంబంధిత బీఎల్ఓలు ప్రతి ఇంటిని కనీసం మూడుసార్లు సందర్శించి, ఓటర్ల నుంచి డిక్లరేషన్ స్వీకరించాలని తెలిపారు.

ఎన్యూమరేషన్ ఫారాలు నింపడం, ఓటర్ల వివరాల పరిశీలన, అవసరమైన పత్రాల ధృవీకరణ తదితర అంశాలపై బీఎల్ఓలకు ఈఆర్వోలు సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, బూత్ లెవల్ ఏజెంట్ల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమాహారతి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్ఓ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో కంటోన్మెంట్, మహిళా సంఘాలకు 2.07 కోట్ల రుణాలు

**-వ్యాపారం చేసి,పన్ను చెల్లించే స్థాయికి ఎదగాలి- ఎమ్మెల్యే శ్రీగణేష్**

కంటోన్మెంట్: మే 29: ప్రజా కలం ప్రతినిధి

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికతో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (౧౦+) సభ్యులకు ప్రభుత్వ సహకారంతో బ్యాంకుల ద్వారా మంజూరైన 2 కోట్ల 7 లక్షల 50 వేల రూపాయల రుణ చెక్కులను,మహిళలకు చీరెలను ఎమ్మెల్యే శ్రీగణేష్ పంపిణీ చేశారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి మహా సంకల్పమని, ఆ విజన్‌కు కంటోన్మెంట్ నుంచే శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ రుణాలు కేవలం అప్పులు కావని, ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం సీఎం ఇస్తున్న పెట్టుబడులని అభివర్ణించారు. ఈ నిధులను ఇంటి ఖర్చులకు పరిమితం చేయకుండా, స్వయం ఉపాధి పొందుతూ వ్యాపార సామ్రాజ్యాలు నిర్మించడానికి వినియోగించాలని మహిళలకు పిలుపునిచ్చారు. సహాయం తీసుకునే స్థాయి నుండి ఇతరులకు సహాయం చేసే స్థాయికి, పన్నులు కట్టే ఆర్థిక శక్తిగా మహిళలు ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలను విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సూపర్ బజార్‌లు, బస్సులు, పెట్రోల్ బంక్‌లు, గోదాములు, క్యాంటీన్ల నిర్వహణ వంటి బాధ్యతలను మహిళా సంఘాలకే అప్పగించాలనే సంకల్పంతో ఉందని, ఇందుకోసం మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు. అనంతరం ప్రభుత్వ చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే.. ఇది కేవలం చీర పంపిణీ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవానికి, ప్రేమకు నిదర్శనమని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రతి పథకం పారదర్శకంగా సాగుతోందని, ప్రతి పైసా నేరుగా లబ్ధిదారుడికే చేరుతోందని స్పష్టం చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గం నుండి కోటీశ్వరులైన మహిళా వ్యాపారవేత్తలను తయారుచేసి ముఖ్యమంత్రి ముందు నిలబెడతామని ఎమ్మెల్యే శ్రీగణేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారి ప్రకాష్, బ్యాంకు అధికారులు ప్రదీప్, నర్సింహ మూర్తి, ఆర్పీలు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# నేడు బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

## - కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 29 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శనివారం పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్లో ఉదయం 10 : 30 గంటలకు నిర్వహిస్తున్నట్లు పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఫామ్ వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 న నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జ్ నల్లమడుగు సురేందర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నారన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు గా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్యే లు, రాజ్య సభ సభ్యులు సురేష్ రెడ్డి, మాజీ కామారెడ్డి జిల్లా పరిషత్ అధ్యక్షులు దఫేదార్ రాజు హాజరు కానున్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, ఎల్లారెడ్డి సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింలు, సీనియర్ నేతలు శ్రవణ్, ఎరుకల సాయిలు పాల్దే నారాయణ చర్ల దేవదాస్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ జర్నలిస్ట్ గా గుర్తించి మరాఠీ జర్నలిస్ట్ లచే మాలజీకి సన్మానం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 29:
ముంబై మహానగరంలో ఉద్యమ భావజాలంతో నిత్యం వార్తలను రాస్తున్న మూలనివాసి మాలజీ గారిని ఉద్యమ జర్నలిస్ట్ గా గుర్తించి అఖిల




మరాఠీ పత్రకర్ పరిషత్ (ఏఎంపిపి) వారు ఘనంగా సన్మానించారు. శుక్రవారం మధ్యాహ్నం ముంబై మరాఠీ పత్రకర్ సంగ్ భవన్లో ఏఎంపిపి వారి ముంబై థానే 2జిల్లాల నూతన కమిటీ ఎంపిక సమావేశం నిర్వహించారు. మహానగరంలో జరిగే మరాఠీ హిందీ ఉర్దూ వారి ఉద్యమాలు కార్యక్రమాలను తెలుగు ప్రపంచానికి చేరదీస్తున్న మాలజీని గుర్తించి, తనను సత్కారం చేసినందుకు "పరిషత్" వారికి మనసార కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 34జిల్లాల్లో పదహారువేల మంది జర్నలిస్టులు సభ్యులున్న ఏకైక విశాల (సంస్థ) పరిషత్. సమావేశానికి ఏఎంపిపి మహారాష్ట్ర అధ్యక్షులు మిలింద్ ఆస్తివ్కర్, ముంబై అధ్యక్షులు రాజా అదాటే, మనోజ్ బోయిర్, దీపక్ కెటకే, విశ్వకర్మ, డిజిటల్ అధ్యక్షులు అనిల్ వాగ్మేరే, దీపక్ పవార్, జితేంద్ర శిర్సాట్ తదితరులు స్టేజిని అలంకరించారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం ఉపాధి పథకాలు ఎంతగానో తోడ్పడుతాయి

## - మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్

## - మెప్మా ఆధ్వర్యంలో రూ. 2 కోట్ల రుణాల పంపిణీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 29 ప్రజా కలం : మహిళల ఆర్థిక అభివృద్ధికి స్వయం ఉపాధి పథకాలు ఎంతగానో తోడ్పడుతా యని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం లో శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తన అధ్యక్షతన మెప్మా ఆధ్వర్యంలో రుణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన మహిళా సంఘాలకు రుణాల మంజూరు పత్రాలను అందజేసి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మెప్మా కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న రుణాలను సక్రమ మార్గంలో వాడుకొని ఎదగాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ వైస్ చైర్మన్ మత్తమాల భాగ్యవతి, మెప్మా అధికారులు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






# దూలపల్లి శ్రీ చైతన్య స్కూల్ తరలింపు నిలిపివేయండి

## -మండల విద్యాశాఖ అధికారికి తల్లిదండ్రుల వినతి

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)తల్లిదండ్రులను విద్యార్థులు మోసం చేస్తూ గుట్టు చప్పుడు కాకుండా శ్రీ చైతన్య స్కూల్ దూలపల్లి బిచాన ఎత్తేసింది. విద్యార్థులకు తల్లిదండ్రులకు చెప్పకుండా స్కూల్ క్లోజ్ చేశారు. విద్యాశాఖకు క్లోజింగ్ లెటర్ ఇవ్వకుండా శ్రీ చైతన్య యాజమాన్యం షిఫ్టింగ్ చేస్తుందని తల్లిదండ్రులు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం దూలపల్లి శ్రీ చైతన్య తల్లిదండ్రులను విద్యార్థులను మోసం చేశారంటూ మండల విద్యాధికారిని కృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విద్యా సంవత్సరం స్కూల్ పుస్తకాలు, ఫీజులు కట్టించుకొని ఎలాంటి సమాచారం లేకుండా స్కూల్ తరలించేందుకు యాజమాన్యం పూనుకుందని వివరించారు. ఇట్టి స్కూల్ తరలింపును నిలిపివేసి తమ పిల్లలకు న్యాయం చేయాలని బాధిత తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. తల్లిదండ్రులకు చెప్పకుండా స్కూల్ క్లోజ్ చేస్తూ విద్యాశాఖకు మూసివేతకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రాతపూర్వకంగా విద్యాశాఖకు సమాచారం ఇవ్వకుండా స్కూలు మూసి వేస్తున్నామని శ్రీ చైతన్య విద్యాసంస్థలకు చెందిన దూలపల్లి శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం మూసివేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు దుండిగల్ విద్యాధికారికి మొరపెట్టుకున్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ... ఫీజులు కట్టించుకున్నారు, బుక్స్ కొనిచ్చారు, తీరా చూస్తే బోర్డు శ్రీ చైతన్య యాజమాన్యం తిప్పేసింది. విద్యార్థులకు దగ్గర అయితుందనే ఉద్దేశంతో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్న తర్వాత అకస్మాత్తుగా ఈ విషయం బయటపడటంతో తల్లిదండ్రుల్లో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది.

స్కూల్ తరలింపుకు అనుమతి లేదు-ఎంఈఓ కృష్ణ ... దూలపల్లిలో నిర్వహిస్తున్న శ్రీ చైతన్య హై స్కూల్ తరలింపుకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని దుండిగల్ విద్యాశాఖ అధికారి జె.కృష్ణ తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న స్కూళ్లపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్కూలు తరలింపుపై అనుమతి లేకపోవడంతో యాజమాన్యం మూసివేతపై తమ దృష్టికి వచ్చిందని వివరించారు.

ఈకార్యక్రమంలో దొడ్ల నాగరాజు, పోశెట్టి శ్రీనివాస్, రాజేందర్, వెంకట్ తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# కేరళ మాజీ ముఖ్యమంత్రిపై ఈడి దాడులు కాంగ్రెస్ బిజెపి లోపాయికారీ ఒప్పందం:సిపిఎం

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరై విజయన్, సిపిఎం నాయకుల ఇండ్లపై ఈడీ దాడులను వ్యతిరేకిస్తూ సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ సిఐటియు కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ రాజకీయ ప్రత్యర్థులను వేటాడేందుకు బిజెపి ఉపయోగించే ప్రభుత్వ జేబు సంస్థలైన ఈడి సీబీఐ లాంటి వాటిని కేరళ రాష్ట్రంలో ప్రతిపక్షం పై ఉపయోగించడానికి యూడీఎఫ్ ప్రభుత్వం కూడా బిజెపితో చేతులు కలిపిందని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు కేరళ అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్ నివాసంలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలను ప్రజలందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ చర్యలు రాజకీయ కక్షసాధింపులో భాగంగా భారీ సన్నాహాలతో ఈడీ అధికారులు బుధవారం ఉదయం 6గంటల ప్రాంతంలో రహస్యంగా సోదాలు ప్రారంభించారనీ తిరువనంతపురంలోని పినరయి విజయన్ అద్దె నివాసం కన్నూర్లోని ఆయన కుటుంబ నివాసంలో ఏకకాలంలో సోదాలు జరిగాయని ఈడీ సుదీర్ఘ విరామం తర్వాత ఈ దాడులను పునఃప్రారంభించారనీ బేపూర్ ఎమ్మెల్యే మరియు మాజీ మంత్రి పి.ఎ.మహమ్మద్ రియాస్కు చెందిన కోజికోడ్లోని ఇంట్లో ఈడీ బృందం సోదాలు నిర్వహించిందని ఇలాంటి చర్యలు పినరాయి విజయన్ను, సిపిఎం పార్టీని గానీ ఏమి చేయలేవన్నారు.

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ఆయుధాలుగా వాడుకుని ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులు పెట్టడానికి కేరళ కాంగ్రెస్ ప్రభుత్వం తో జత కలిసి కుట్ర పన్నుతోందని విమర్శించారు. బిజెపి కాంగ్రెస్ అపవిత్ర కలయికతో కేరళ సిపిఎం నాయకులను ఇబ్బందులకు గురి చేస్తే దేశంలో ఉన్న వామపక్షా లౌకిక ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమై కేంద్రంలో బిజెపి కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలను ఎదుర్కొంటామన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు పసుల అంజయ్య, రావుల స్వాతి, ఈ.దేవదానం, కరుణాకర్, కే.శీను తిమ్మప్ప, దుర్గా నాయక్, మల్లారెడ్డి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనా - ప్రగతి ప్రాణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా, దుండిగల్ డివిజన్ ని సందర్శించిన జోనల్ కమీషనర్ పింకీష్ కుమార్ ఐఏఎస్, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

ప్రజాకలం/కుత్బుల్లాపూర్
(ప్రతినిధి)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బౌరంపేట్ డివిజన్ లోని పలు సమస్యలను టీపీసీసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి దృష్టికి తీసుకుని వచ్చినందున శుక్రవారం జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, దుండిగల్ డిప్యూటీ కమిషనర్ మణికరణ్, మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యల పరిష్కారం కోసం పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.



ఈకార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, బౌరంపేట్ మాజీ సర్పంచ్ యాదిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి భరత్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి చిరంజీవి, సీనియర్ నాయకులు విజయ్ గౌడ్, సురేష్, పోచి మహేష్, ఆంజనేయ వర్మ, స్థానిక ప్రజలు, వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వలిగొండ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ

## - పెట్రోలింగ్ ప్రజా ఫిర్యాదులపై సిబ్బందికి కీలక ఆదేశాలు..

## - శాంతి భద్రత పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

## - జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్..

వలిగొండ మే 29 ప్రజాకలం:శాంతి భద్రతలను కాపాడటం ప్రజలకు రక్షణగా నిలవడమే,తమ ప్రథమ ప్రాధాన్యత,అని జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ అన్నారు.శుక్రవారం రోజున వలిగొండ పోలీస్ స్టేషన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పనితీరును సిబ్బంది క్రమశిక్షణ అత్యవసర సమయాల్లో స్పందించే విధానాన్ని ఆయన పరిశీలించారు.అంతే కాకుండా క్రైమ్ విభాగం, జనరల్ డైరీ నిర్వహణను ఎస్పీ పరిశీలించారు.అలాగే స్టేషన్ కు చెందిన వాహనాలను,వాటి సైరన్ లను,బ్లూ కోల్ట్స్,స్థితి గతులను వాటి పనితీరును సైతం తనిఖీ చేశారు.పెట్రోల్ వాహనాలతో నిరంతరం గస్తీ కాయాలని,ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచేలా విజబుల్ పోలీసింగ్ నిర్వహించాలని,ఆయన తెలిపారు.అలాగే స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే సహాయం అందించాలని, ఎఫ్ఐఆర్ నమోదులో ఎలాంటి జాప్యం జరగద్దని ఆయన అన్నారు.అలాగే శాంతి భద్రతల పరిరక్షణలో లేదా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు.



# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

## : గోదాంలను పరిశీలించిన కలెక్టర్ హైమావతి.

సిద్దిపేట ప్రజాకలం మే 29.
జిల్లాలో రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం రైతువేదిక వెనకాల గల సీడబ్ల్యూసీ గోదాం, మీరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలోని ఆధునిక మార్కెట్ కమిటీ గోదాం, కొండపాక మండల కేంద్రంలోని గోదాంలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, కొనుగోళ్లను



మరింత వేగవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం శాయశక్తులా పనిచేస్తోందని తెలిపారు. మిల్లుల్లో స్థల కొరత కారణంగా ధాన్యం దిగుమతిలో కొంత ఆలస్యం జరుగుతోందని, ఈ సమస్య పరిష్కారానికి మండలాల వారీగా అందుబాటులో ఉన్న గోదాంలను పరిశీలిస్తున్నామని చెప్పారు.
దౌల్తాబాద్ మండల కేంద్రంలోని సీడబ్ల్యూసీ గోదాంలో నిల్వ ఉన్న శనగలను పక్కనే ఉన్న మక్కల గోదాంలోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని డీఎం మార్కెటింగ్ నాగరాజును ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ గోదాం మొత్తం వరి నిల్వకు అనుకూలంగా ఉండటంతో స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మీరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలోని గోదాంపై రేకుల షీటింగ్లో గ్యాప్లు లేకుండా మరమ్మతులు చేసి గోదాంను వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. కొండపాక మండల కేంద్రంలోని గోదాంను శుభ్రపరిచి, చెత్తాచెదారం తొలగించి స్థానిక కొనుగోలు కేంద్రాల నుండి వరి ధాన్యాన్ని అక్కడికి తరలించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున్కు సూచించారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా, ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకుంటూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆమె భరోసా ఇచ్చారు.



# వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి చామల కిరణ్ కుమార్ రెడ్డి పేరు?

## - కాంగ్రెస్ శ్రేణుల నుంచి బలమైన డిమాండ్

## -పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తున్న భువనగిరి ఎంపీ

### - రామిడి శ్రవణ్ రెడ్డి, టీపీసీసీ సోషల్ మీడియా ఇంచార్జ్, భువనగిరి పార్లమెంట్.




భువనగిరి, మే 29 (ప్రజాకలం) :

పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే నాయకుడిగా, కార్యకర్తలకు అండగా నిలిచే వ్యక్తిగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, పార్లమెంట్ వేదికగా ప్రజల తరఫున గళమెత్తుతున్న ఆయనకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలన్న డిమాండ్ కాంగ్రెస్ శ్రేణుల్లో బలంగా వినిపిస్తోంది.

ఎంపీగా ఎన్నికైన నాటి నుంచి భువనగిరి పార్లమెంట్ పరిధిలోని గ్రామీణ సమస్యలు, యువత ఉపాధి, అభివృద్ధి అంశాలపై చురుకుగా వ్యవహరిస్తున్నారని కార్యకర్తలు పేర్కొంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ ముందుంటున్నారని చెబుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు పార్టీ తరఫున గట్టిగా సమాధానం ఇస్తూ, తన రాజకీయ అవగాహనతో బలమైన స్వరంగా నిలుస్తున్నారని పార్టీ నాయకులు అంటున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, యువతలో కాంగ్రెస్‌పై విశ్వాసం పెంచడం, కార్యకర్తలకు అండగా నిలవడం వంటి



అంశాల్లో ఆయన పాత్ర ప్రత్యేకమని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, కేంద్ర నాయకత్వం Indian National Congress చామల కిరణ్ కుమార్ రెడ్డికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి అప్పగించాలని భువనగిరి పార్లమెంట్ పరిధి కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారు.

# రైతు డిస్కమ్ ప్రభుత్వ కుట్ర

## కల్వకుంట్ల కవిత ధ్వజం




హైదరాబాద్:మే 29: ప్రజా కలం ప్రతినిధి

రైతు డిస్కమ్ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచేందుకు కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండి పడ్డారు. రైతులు ఎవరూ అడగకుండానే విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం అన్నదాతల పాలిట శాపంగా మారబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి ఎండ్రిన్ (విషం) పోసే విధంగా ఉన్న ఈ ప్రపోజల్‌ను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తక్షణమే తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఎర్రగడ్డలోని ఈఆర్సీ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్‌లో కవిత పాల్గొని, రైతు డిస్కమ్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు.

**ఆరు నెలలుగా ఎందుకు దాచారని కవిత ప్రశ్న?**

ఈ నిర్ణయం నిజంగా రైతులకు మేలు చేసేదే అయితే.. గత ఆరు నెలలుగా ప్రభుత్వం ఈ విషయాన్ని ఎందుకు సీక్రెట్‌గా ఉంచిందో సమాధానం చెప్పాలని కవిత నిలదీశారు. ఈఆర్సీ పబ్లిక్ హియరింగ్ పెట్టడం వల్లే ఈ విషయం బయటకు వచ్చిందని, లేదంటే ప్రభుత్వం దీనిని గుట్టుచప్పుడు కాకుండా సాగించేదని విమర్శించారు. ఇంతటి కీలకమైన అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అసెంబ్లీలో చర్చించకుండా దొంగచాటుగా వ్యవహరించడం వెనుక దురుద్దేశం దాగి ఉందన్నారు. రూ. 25 వేల కోట్ల నష్టాల్లో ఉన్న డిస్కమ్‌ను కంపెనీగా ఎలా రిజిస్టర్ చేస్తారని ప్రశ్నించారు.

**1999 నాటి కాల్పుల ఘటనను కొని తెచ్చుకోవద్దు**

రైతులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తే, ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ ఉద్యమం సందర్భంగా జరిగిన 1999 నాటి బషీర్‌బాగ్ కాల్పుల ఘటన వంటి పరిస్థితులను కొని తెచ్చుకున్నట్లే అవుతుందని కవిత హెచ్చరించారు. రైతుల ఆగ్రహానికి గురికాకముందే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఏసీ రూముల్లో కూర్చొని ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్స్ నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించాలని ఈఆర్సీని కోరారు. ఈఆర్సీ అనుమతి రాకుండానే జూన్ 2 నుంచి కొత్త డిస్కమ్ పనిచేస్తుందని సీఎం మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

**రైతులకు తీరని నష్టం-ప్రైవేటీకరణకే మొగ్గు**

కొత్త డిస్కమ్‌కు 42 శాతం పవర్ లోడ్‌ను బదిలీ చేస్తూ, కేవలం 2 వేల మంది ఉద్యోగులను మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. దీనివల్ల రేపు పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రిపేరు కావడానికి రెండు నెలలు పడుతుందని, రిపేర్ సెంటర్లు కూడా తాలూకా కేంద్రాలకు మారిపోయి రైతులు గోసపడతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న 29 లక్షల బోరు బావుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. డిస్కమ్‌ల నష్టాలను సాకుగా చూపి భవిష్యత్తులో దీనిని ప్రైవేటుపరం చేయడమే కాకుండా, కేంద్ర నిబంధనలకు తలొగ్గి రైతుల మోటార్లకు మీటర్లు పెట్టేందుకే రేవంత్ సర్కార్ ఈ అడుగులు వేస్తోందని ఆరోపించారు.

**ప్రభుత్వమే పెద్ద బకాయిదారు**

డిస్కమ్‌లకు మైనస్ 'సీ' రేటింగ్ రావడానికి ప్రభుత్వమే కారణమని కవిత స్పష్టం చేశారు. డిస్కమ్‌ల మొత్తం రూ. 69 వేల కోట్ల బకాయిల్లో, ప్రభుత్వమే రూ. 54 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. సబ్సిడీలు, ఉచిత విద్యుత్, లిఫ్ట్ ఇరిగేషన్ బిల్లులను సకాలంలో కట్టని ప్రభుత్వం.. కొత్త డిస్కమ్‌కు ఎక్కడి నుంచి నిధులు ఇస్తుందని ప్రశ్నించారు. కొత్తగా ఎక్కువ గంటలు కరెంట్ ఇవ్వనప్పుడు, ఉన్న డిస్కమ్‌లలోనే సమస్యలు పరిష్కరించుకోవచ్చు కదా అని నిలదీశారు.

**ఆంధ్రా ఉద్యోగుల పెత్తనం సహించం**

తెలంగాణ వచ్చిన తర్వాత 24 గంటల కరెంట్ కోసం ఇక్కడి విద్యుత్ ఉద్యోగులు రాత్రింబగళ్లు కష్టపడితే, రేవంత్ ప్రభుత్వం 1200 మంది తెలంగాణ ఉద్యోగులకు నష్టం చేస్తూ, ఆంధ్రా నుంచి వచ్చిన 1700 మంది ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చిందని కవిత ఆరోపించారు. ఇప్పటికే జెన్‌కో, రెడ్కో,సదరన్ డిస్కమ్‌లలో ఆంధ్రా వాళ్ల పెత్తనం నడుస్తోందని విమర్శించారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో రైతు డిస్కమ్ పెట్టాల్సి వస్తే,అందులో కేవలం తెలంగాణ ఉద్యోగులకే బాధ్యతలు అప్పగించాలని ఆమె డిమాండ్ చేశారు.





# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

## -జీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి

భూదాన్ పోచంపల్లి మే 29 ( ప్రజా కలం )

దేశానికి వెన్నుముక రైతు అలాంటి రైతులను గోస పెడుతున్న తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విఫలమయ్యారని, పోచంపల్లి మండల మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. అనంతరం మాట్లాడుతూ శుక్రవారం ఉదయం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో నేతాజీ చౌరస్తా కూడలిలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు పై ధర్నా కార్యక్రమం నిర్వహించారు.రైతులను నాటెంట ముంచుతున్న రేవంత్ సర్కార్ రైతులను ఎందుకు ఇంత దోస పెడుతున్నారని, రైతులు అంటే అంత చులకన గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం లో కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులు రాజులుగా బతికేవారు. మార్కెట్లో ధాన్యం పోసిన రోజు నుండి 45 రోజులలో ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కనీసం ఇప్పటివరకు ఎక్కడ చూసినా 50% కూడా కొనుగోలు చేయలేదని. అన్నారు. రైస్ మిల్లర్లది ఏమైనా తప్పు ఉంటే అధికారులు ప్రభుత్వం వాళ్లని అడగండి అంతేకానీ రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని అన్నారు. ఇప్పటికైనా జూన్ మొదటి వారంలో గా పూర్తిగా కొనుగోలు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాట్టి సుధాకర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సిలువేరు బాల నరసింహ,నాయకులు ముత్యాల మహిపాల్ రెడ్డి,బత్తుల శ్రీశైలం, రావుల శేఖర్ రెడ్డి, పగిళ్ల సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సీత వెంకటేష్ , కౌన్సిలర్లు పెద్దల చక్రపాణి, బాత్కా లింగస్వామి, నాయకులు గుండు మధు, సిపిఎం నాయకులు కోట రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సైనిక, పారామిలిటరీ సిబ్బంది కుటుంబాలకు 'ఆకాశ్' భారీ స్కాలర్‌షిప్‌లు

కంటోన్మెంట్: మే 28: ప్రజాకలం ప్రతినిధి

దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల, ప్రస్తుతం సేవలందిస్తున్న, మాజీ సైనిక, పారామిలిటరీ సిబ్బంది పిల్లల విద్యా వృద్ధికి తోడ్పాటునందించేందుకు ప్రముఖ పరీక్షల సన్నాహక సంస్థ 'ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ అద్భుతమైన నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా భారత సైన్యంతో పాటు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (BSF), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (CRPF), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ITBP) దళాలతో ప్రత్యేక అవగాహన ఒప్పందాలు (MoU) కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే రక్షణ దళాల పిల్లలకు దేశవ్యాప్తంగా ఉన్న ఆకాశ్ కేంద్రాలలో భారీగా ఫీజు మినహాయింపులు, ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల పిల్లలకు 100 శాతం వరకు ఫీజు మినహాయింపు కల్పించి అండగా ఉంటామి హామీ ఇచ్చారు. శౌర్య పురస్కార గ్రహీతలు, దివ్యాంగ సైనికులు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న, పదవీ విరమణ చేసిన సిబ్బంది పిల్లలకు వారి అర్హతలను బట్టి 20 శాతం నుండి 90 శాతం వరకు ట్యూషన్ ఫీజులో మినహాయింపులు అందిస్తామని,దేశవ్యాప్తంగా రక్షణ కుటుంబాలకు నాణ్యమైన విద్యను అందించి, వారి ఆర్థిక అడ్డంకులను తొలగించడమే




ఈ బహుళ సంవత్సరాల కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆకాశ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ చంద్ర శేఖర్ గరిస రెడ్డి తెలిపారు.స్కాలర్ షిప్‌లతో పాటు విద్యార్థులకు వర్చువల్, ఆఫ్‌లైన్ విధానాల్లో కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్, మెంటరింగ్ సేవలను కూడా ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు.

# కంటోన్మెంట్ లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, కేటీఆర్ రాక..నేతల్లో ఉత్సహం-మన్నె కృశాంక్

## మాటల ఎమ్మెల్యే,మౌలిక వసతుల కల్పనలో వైఫల్యం

## నియోజకవర్గానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల చిన్న చూపు

కంటోన్మెంట్:మే 29: ప్రజాకలం ప్రతినిధి

కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 31న క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహి స్తున్నట్లు పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె కృశాంక్ తెలిపారు. ఓటర్ జాబితా సమగ్ర సవరణ,సభ్యత్వ నమోదు పై బూత్ స్థాయి కార్యకర్తలకు నిర్వహించే ప్రత్యేక శిక్షణ తరగతులకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కృశాంక్ మాట్లాడుతూ.. ప్రతి వార్డులో బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, నాయకులంతా సమిష్టిగా కృషి చేసి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కంటోన్మెంట్ ప్రాంతానికి అటు కేంద్రం, ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే కేవలం మాటలకే పరిమితమై మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం గత ఆరేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పదవులతో కాలం వెళ్లదీస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికిన కుటుంబ సంక్షేమ కార్డుల్లో ఇప్పటివరకు ఒక్కటి కూడా జారీ చేసిన దాఖలాలు లేవని కృశాంక్ దుయ్యబట్టారు.



# మల్లంపేట్, బౌరంపేట్లలో ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ

మేడ్చల్: మే 29: ప్రజా కలం ప్రతినిధి

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మల్లంపేట్, బౌరంపేట్ ప్రాంతాల్లో తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పడాల మనోజ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన జెండాను ఘనంగా ఆవిష్కరించారు. దక్షిణ భారతదేశంలోనే ఈ కార్యక్రమానికి ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చేలా అత్యంత విజయవంతంగా దీనిని రూపొందించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా





రాష్ట్ర నాయకులు కిషోర్ యాదవ్, కృష్ణవేణి, మారయ్యలు నవీన్ గోగిఖర్, సంధ్యారెడ్డి, సాత్విక రెడ్డి, వెంకన్న, కుమార్, శాంత, ఊర్మిళ, నవీన్, మనీష్, రాకేష్, సంతోష్, ఈశ్వర్, ఏఎల్బీ రాజు, శ్రీనివాస్ యాదవ్, మనోహర్, యశస్విని, వేణునాథ్, శామ్యూల్ రాజ్ తదితరులు పాల్గొని కార్యక్రమ విజయవంతానికి కృషి చేశారు. ఈ జెండా ఆవిష్కరణ మహోత్సవంలో స్థానిక మహిళలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తెలంగాణ రక్షణ సేన పట్ల తమకున్న అభిమానాన్ని, ఐక్యతను చాటుకున్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com